Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

## ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

**- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భమికి ఎసరు**
**- నకిలీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్,మే29 : ఫేక్ జీఓలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల

11లో

## ఆయిల్ పామ్ అమలులో తెలంగాన అగ్రస్థానం

**- సాగులో తెలంగాణ వాటా 36 శాతంగా నమోదు**
**- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


తుమ్మల నాగేశ్వ రరావు

హైదరాబాద్, మే 29 : ఆయిల్ మిషన్ ఆన్ ఎడిబిల్ ఆయిల్- ఆయిల్ పామ్ అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో సాధించిందని వ్యవ సాయ శాఖ మంత్రి

11లో

సంపుటి: 17 | సంచిక: 5 | కరీంనగర్ | శనివారం 30 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## నీట్ పేపర్ లీకేజీ

# దోషులను వదలం

**- వారిని కఠినంగా శిక్షించి తీరుతాం - విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,మే29 : నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు

11లో

## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా

# ఇళ్ల డిజైన్

**- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు**
**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 29 :పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి



ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని

11లో

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

**కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




హైదరాబాద్,మే29 : రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే

11లో

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి

# కన్నుమూత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్,మే29 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు

11లో

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

**- ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ - అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య - సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం - సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 29 : తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు



కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా,

11లో

## తెలంగాణలో

# అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

**- అయిన ఆచివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం**
**- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం**
**- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం**
**- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 29 : దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొం

11లో

## తెలంగాణ బిడ్డలను

# ముట్టుకుంటే ఖబర్దార్

**- ప్రొపెసర్ నాగేశ్వర రావును అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు**
**- మళ్లీ గో బ్యాక్ ఆంధ్ర ఉద్యమం చేపడతాం**
**- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మే 29 : తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే, ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలవుతుందని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి, అర్హత పవన్ కళ్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి, అప్పుడు ఆయన

11లో




**- 80శాతం ధాన్యం కుప్పల పేరుకున్నాయి**
**-బిజెపి భరోసా యాత్రలో అసలు విషయాలు గమనించాం**
**- సిఎం రేవంత్‌కు అధికారులపై పట్టు లేదన్న ఏలేటి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 29 : రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని

11లో

## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

**- జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి**
**- 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలి**
**- కార్మికులకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే29 : రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్

11లో

## రైతులు సేంద్రియ

# వ్యవసాయం వైపు మారాలి

**- సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం**
**- ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి**
**- రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు : మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 29 : హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ÷ూష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు.



రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయ పడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగు పడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న

11లో





# 'కుమురం భీమ్ ఆశయాలతో యువత ముందుకు సాగాలి

## - ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత - కుమురం భీమ్ త్యాగం దేశానికి స్ఫూర్తి
## - రౌటా సంకెపల్లి గ్రామంలో 'కుమురం భీమ్ జల్ జంగల్ జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం-2026'
## - రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 29 : కుమురం భీమ్ త్యాగం దేశానికి స్ఫూర్తి అనివారి ఆశయాలతో యువత ముందుకు సాగాలనీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు నిచ్చారు. శుక్రవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రౌట సంకెపల్లి గ్రామంలో నిర్వహించిన "కుమురం భీమ్ జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం–2026" కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రౌట సంకెపల్లి కేవలం ఒక గ్రామం మాత్రమే కాదని, ఆదివాసీ సమాజ వీరత్వం, త్యాగం, ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్ర స్థలమని పేర్కొన్నారు. అమర వీరుడు కుమురం భీమ్ ఇచ్చిన "జల్, జంగల్, జమీన్" నినాదం కేవలం మూడు పదాలు కాదని, ప్రకృతి–మనిషి సహజీవనానికి ప్రతీక అని గవర్నర్ అన్నారు. ప్రకృతిని కాపాడే సమాజాన్ని ప్రకృతి కూడా కాపాడుతుందని పేర్కొన్నారు. కుమురం భీమ్ తన హక్కులు, ఆత్మగౌరవం కోసం గొప్ప సైన్యం లేకపోయినా ధైర్యసాహసాలతో పోరాడారని, ఆయన త్యాగం దేశ ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ఉదాహరణగా నిలిచిందన్నారు. ఆదివాసీ మహానేతల ఆలోచనలు, ఆదర్శాలను యువతకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గవర్నర్ పేర్కొన్నారు. గ్రామోత్సవం ద్వారా గ్రామీణాభివృద్ధి, సంప్రదాయ విద్య, ఆరోగ్యం, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యం కల్పించడం అభినందనీయమన్నారు. మహిళల సాధికారత లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని గవర్నర్ స్పష్టం చేశారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించి, విద్య, గౌరవం, స్వావలంబన దిశగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. దేశం వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తున్నప్పటికీ యువత తమ మూలాలను, సంస్కృతిని మరవకూడదని గవర్నర్ సూచించారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ, సమాజ సేవ భావన ద్వారానే విజయాన్ని సాధించవచ్చున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేస్తున్నప్పటికీ, సమాజ భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమని గవర్నర్ పేర్కొన్నారు. రౌటా సంకెపల్లి గ్రామం భవిష్యత్తులో ఆదర్శ ఆదివాసీ అభివృద్ధి, సామాజిక చైతన్యానికి కేంద్రంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. గ్రామోత్సవం నిర్వహించిన నిర్వాహక కమిటీ సభ్యులను, సామాజిక సేవకులను గవర్నర్ అభినందించారు. ప్రకృతిని పరిరక్షిస్తూ, సంస్కృతిని కాపాడుతూ, సమానాభివృద్ధి కలిగిన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఆత్మ గౌరవ పోరాటానికి పునాది వేసిన పోరాట యోధుడు కొమురం భీం అని పేర్కొన్నారు. వారి స్ఫూర్తి తో నిర్వహిస్తున్న ఈ కార్యమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రావడం సంతోషకరంగా ఉందన్నారు. భీం జల్ జంగల్ జమీన్ అనే నినాదం తో ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలన పై పోరాటం చేశారన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ గిరిజన కుటుంబాలకు సౌర విద్యుత్తు పలకాలను పంపిణీ చేశారు. అంతకుముందు గవర్నర్ కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురం భీం కాంస్య విగ్రహా ప్రతిష్టాపనకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, కాటేపల్లి వెంకటరమణ, వెడ్మ బొజ్జు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్పీ నితికా పంత్, నిర్వాహకులు రాయపూడి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి

## కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, మే 29 : జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 20 వరకు బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న విద్యాసంస్థల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న విద్యాసంస్థల్లో తగిన సిబ్బంది, ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలలు, హాస్టళ్లు ప్రారంభానికి ముందే కామన్ డైట్ మెనూకు అవసరమైన సరుకుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన సరుకులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు తదితర సామగ్రి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ తిరుపతిరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఆర్‌సీఓ అంజలి, విద్యాశాఖ ఏడి మాధవి, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కోప్టా చట్టం అమలును పటిష్టం చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 29 : జిల్లాలో కోప్టా చట్టం–2003 అమలును కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి ఎన్‌టీసీపీ, కోప్టా చట్టం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యాసంస్థలు, హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పోలీసు శాఖ సహకారంతో జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు వంటి జనసమ్మర్ద ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై వెంటనే జరిమానాలు విధించాలని, పునరావృతమైతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నెలా గ్రౌండ్ లెవల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కోప్టా చట్టం అమలును పర్యవేక్షించాలని, పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని తెలిపారు. కోప్టా చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# టూ పోస్ట్ హైడ్రాలిక్ వెహికల్ లిఫ్టర్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

## - పోలీస్ వాహనాల మరమ్మత్తులు వేగవంతం
## - నిర్వహణ ఖర్చులు తగ్గనున్నాయని వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 29 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన టూ పోస్ట్ హైడ్రాలిక్ వెహికల్ లిఫ్టర్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ ఆధునిక పరికరం ద్వారా వాహనాల క్రింది భాగంలో చేపట్టాల్సిన ఇంజిన్, గేర్‌బాక్స్ తదితర మరమ్మత్తులను సులభంగా, వేగవంతంగా నిర్వహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, పోలీసు వాహనాలు నిరంతరం విధుల్లో వినియోగంలో ఉండటంతో తరచూ మరమ్మత్తులు అవసరమవుతున్నాయని చెప్పారు. ఇందుకోసం బయట మెకానికల్ వర్క్‌షాప్‌లపై ఆధారపడాల్సి రావడం వల్ల సమయం, ఖర్చు రెండూ అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి ప్రత్యామ్నాయంగా మోటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్క్‌షాప్‌లో హైడ్రాలిక్ వెహికల్ లిఫ్టర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరికరం ద్వారా మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నిర్వహణ ఖర్చులను కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఓ. సుధాకర్ రావు, నరసింహారావు, లాల్ బాబు, కృష్ణతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

## - రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కటింగ్ పెట్టొద్దు
## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 29 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, శారదనగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గౌతమినగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ ఆసుపత్రిలోని రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, సమయం ముగిసిందనే కారణంతో ఏ రోగినీ వెనక్కి పంపకుండా శాంపిల్స్ సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గైనిక్ ఓపీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శారద నగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్, ఇంటర్మీడియట్ ఫలితాలు, స్టడీ రూమ్ సౌకర్యం, అడ్మిషన్లు తదితర అంశాలపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని సూచించారు. తదుపరి గౌతమినగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన కలెక్టర్, రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్‌లు విధించరాదని మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలని, రైతులు ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట డాక్టర్లు అరుణ, కృపాభాయి, రాజు, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

# మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

## - చిన్నారుల విద్యకు కొత్త ఊపిరి
## - జిల్లా విద్యాశాఖ అధికారి అల్లం సిద్ధార్థ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 29 : ములుగు జిల్లాలో మెరుగైన విద్య అవకాశాలను విద్యార్థులకు అందించడానికి కృషి చేస్తున్నామని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి అల్లం సిద్ధార్థ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2026–27 విద్యాసంవత్సరం నుంచి ములుగు జిల్లాలో మొత్తం 36 పూర్వ ప్రాథమిక బడులు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్ పి డి) తాజా ఆమోదంతో ఈ బడులు మంజూరు చేయబడ్డాయని ఈ కొత్త బడుల ప్రారంభంతో జిల్లాలోని చిన్నారులకు ప్రాథమిక స్థాయిలో విద్యా సదుపాయాలు మరింత విస్తరించనున్నాయి. జిల్లాలో ఇప్పటికే ఉన్న 11 పూర్వ ప్రాథమిక బడులకు తోడు ఈ కొత్త బడులు ప్రారంభమవుతుండటంతో విద్యార్థుల చేరికలు పెరగనున్నాయని మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య, అవసరాల ఆధారంగా బడులు ఏర్పాటు చేయబడిందని తెలిపారు. పూర్వ ప్రాథమిక బడులు విద్యార్థుల సౌకర్యం దృష్ట్యా ఏర్పాటు చేయబడ్డాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సహకారంతో చిన్నారుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మెరుగైన విద్య అందించేందుకే పూర్వ ప్రాథమిక బడుల ద్వారా చిన్నారులకు ప్రాథమిక స్థాయిలో విద్యా పునాది బలపడేలా విద్యాశాఖ కృషి చేస్తోందని, ఈ బడులు ప్రారంభమవడం ద్వారా ములుగు జిల్లాలో విద్యా వాతావరణం మరింత చైతన్యవంతం కానుందని తెలిపారు.

# ఆర్జీ-1లో సింగరేణి సీ,ఎండి విస్తృత పర్యటన





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 29 : సింగరేణి సీ,ఎండి డా.బుద్ధప్రకాశ్ జ్యోతి శుక్రవారం ఆర్జీ–1 ఏరియాలో విస్తృతంగా పర్యటించి గనుల ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, భద్రతా చర్యలు, కంపెనీ సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. పర్యటనలో భాగంగా జీడీకే–11 ఇంక్లైన్ గనిలో ఉద్యోగులు, అధికారులు, కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి సంస్థ అభివృద్ధికి సూచనలు కోరారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, ఉత్పాదకత, నాణ్యత మెరుగుదల, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. సింగరేణి సంస్థకు ఉన్న అనుభవం, క్రమశిక్షణ, సమిష్టి పనితత్వం సంస్థ ప్రత్యేకత అని పేర్కొంటూ, ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమం, భద్రతకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గనిలో ఏర్పాటు చేసిన 5వ మాన్ రైడింగ్ సిస్టమ్ ను ప్రారంభించారు. ఈ సిస్టమ్ ద్వారా భూగర్భ గనుల్లో పని ప్రాంతాలకు కార్మికులు సురక్షితంగా, వేగంగా చేరుకునే అవకాశం కలుగుతుందని, శారీరక శ్రమ తగ్గుతుందని తెలిపారు. మాన్ రైడింగ్ సిస్టమ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను అభినందించి సన్మానించారు. డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ జీడీకే–11 గని సింగరేణిలో అత్యధిక యాంత్రీకరణ, అధిక ఉత్పాదకత కలిగిన రెండవ అతిపెద్ద గని అని తెలిపారు. ఆధునిక యంత్రాలను సమర్థంగా వినియోగించి వ్యయాన్ని తగ్గిస్తూ ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సూచించారు. డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్థను నష్టరహిత స్థాయికి తీసుకెళ్లి లాభాలతో ముందుకు నడిపించాలని, ప్రస్తుతం ఉన్న ఒక మిలియన్ టన్నుల ఉత్పత్తిని భవిష్యత్తులో 1.5 మిలియన్ టన్నుల ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని సూచించారు. తదుపరి జీడీకే–5 ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించిన సీఎండీ బొగ్గు, ఓవర్‌బర్డెన్ ఉత్పత్తి, రవాణా, యంత్రాల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించి ఉద్యోగులు, కుటుంబ సభ్యుల కోసం కల్పిస్తున్న క్రీడా, వినోద సదుపాయాలను పరిశీలించారు. తరువాత ఆర్జీ–1 ఏరియా జీఎం కార్యాలయంలో అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో సమావేశం నిర్వహించి బొగ్గు ఉత్పత్తి, భద్రతా ప్రమాణాలు, నాణ్యత, వ్యయ నియంత్రణ, భవిష్యత్ లక్ష్యాలపై సమీక్షించారు. అన్ని ఏరియాలు సమన్వయంతో పనిచేసి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.తిరుమలరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ఎడిషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న, ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, ఆర్జీ–3 జనరల్ మేనేజర్ మధుసూదన్, ఆర్జీ–2 ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మాలోత్ రాముడు, జీఎం (సీడీఎన్), మార్కెటింగ్ టి.శ్రీనివాస్, జీడీకే–11 ఏజెంట్,ఏజీఎం చిల్క శ్రీనివాస్, మేనేజర్ బి.మల్లేశం, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీనివాస్, ఎస్ఓ టూ జీఎం చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, మేనేజర్ అనిల్ గబాలే, అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలీసులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం అవసరం


## - పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
## - కేసుల విచారణ,శిక్షల శాతం పెంపుపై సీపీ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 29 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే కేసుల విచారణలో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాల్లో నమోదయ్యే వివిధరకాల కేసుల్లో దర్యాప్తు ప్రారంభం నుంచి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ఎదురయ్యే అంశాలు, సమస్యలపై శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,కేసుల విచారణలో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కూడా అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు జరిగే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోర్టులో విచారణ సమయంలో అవసరమైన సాక్ష్యాధారాలు, సాక్షులను సరైన విధంగా సమర్పించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తు సమయంలో బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసే వేళ పూర్తి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంలో ఎక్కడైనా సమన్వయ లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు చేపడితేనే బాధితులకు నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. న్యాయాధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ నేరస్థులకు తప్పనిసరిగా శిక్షలు పడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# అర్జీవన్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## - సిఅండ్ఎండికి వినతి పత్రం అందజేత గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 29 : సింగరేణి ఆర్జీవన్ ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీరు, వైద్యం, మెటీరియల్ సరఫరా వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), అర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు శుక్రవారం వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం సి అండ్ ఎండి జ్యోతి బుద్ధ ప్రకాశ్ రామగుండం ఏరియా వన్ లోని జిడికె 11వ ఇంక్లైన్ కు వచ్చిన సంధర్భంగా ముందుగా ఆయనకు పూల బోకె అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపడం జరిగిందని ఆయన అన్నారు. అనంతరం వినతి పత్రంలో ప్రధాన డిమాండ్లను రంగు శ్రీను వివరించారు. ముఖ్యంగా అర్జీ వన్ లో రూ. 20 కోట్లతో నిర్మిస్తున్న గ్రావిటీ వాటర్ ఫిల్టర్ బెడ్ పనులు వెంటనే పూర్తి చేసి శుద్ధి చేసిన త్రాగునీరు అందించాలని, ఏరియా హాస్పిటల్‌లోని క్యాథలాబ్ బోర్డు పేరును "సింగరేణి క్యాథలాబ్"గా మార్చాలని, మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్ల కు ఉద్యోగాలు ఇవ్వాలని,గనుల్లో పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేసి ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఓసిపి–5 లో కొత్త డంపర్లు, షావల్స్, లోడర్లు మంజూరు చేయాలని, సి.ఎస్.ఆర్ నిధులను ప్రభుత్వ పథకాల కు కాకుండా కార్మిక కాలనీలు, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని, ఏరియా హాస్పిటల్ లో పూర్తిస్థాయి డాక్టర్లను నియమించి, అవసరమైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని. అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్స్, హ్యాండ్ గ్లౌసులు, శిలలు, నట్–బోల్ట్స్ తదితర మెటీరియల్ సరఫరాను మెరుగుపరచాలని,. అన్ని గనులు, డిపార్ట్మెంట్ లో కార్మికుల సౌకర్యార్థం కఫ్ బోర్డ్స్ వెంటనే ఏర్పాటు చేయాలని, తక్షణమే పై సమస్యల ను పరిష్కరించాలని సి అండ్ ఎం డి ని కోరడం జరిగిందని రంగు శ్రీను పేర్కొన్నారు.








# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 29 : ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్ లతో కలిసి వందేమాతర గీతం ఆలపించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రజలకు అందించే పౌష్టిక ఆహారం, ప్రజల ఆరోగ్యంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ జిల్లా వైద్య పరంగా అభివృద్ధికి కృషి చేసి రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలో 464 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి జిల్లా అధికారులు ఒక్కొక్కరిని దత్తత తీసుకొని, నెలకు సరిపడా మందులు, పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. చాలామంది దగ్గు, బరువు తగ్గుదల, ఆరోగ్య క్షీణత పై బయటకు చెప్పకుండా లో లోపల మదన పడుతుంటారని, బయటకు చెబితే సమాజం చిన్నచూపు చూస్తారని ఎవరికీ చెప్పకుండా ఆందోళన చెందుతుంటారని, అలాంటి వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి సరైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. చికిత్స అనంతరం క్షయ వ్యాధి నయం అవుతుందని, చికిత్సలు పొందాలని అవగాహన కల్పించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు, మత్తుకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, నషా ముక్త్ భారత్ వైపు అడుగులు వేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని, స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమాజంలో జరిగే అరాచకాలపై మౌనంగా ఉండొద్దని, ప్రజా వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఆకాంక్షిత జిల్లాలో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కే హరిత జిల్లాలో శాఖల వారీగా చేపడుతున్న సేవలు, సంక్షేమ అభివృద్ధి పనులపై గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్.పి. నితికా పంత్ జిల్లాలో శాంతి భద్రతల పట్ల, మాదకద్రవ్యాల చర్యలపై వివరించారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్, ఎస్.పి., జిల్లా అధికారులు స్వాగతం పలికిన అనంతరం రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకున్న కలెక్టర్ కు ధృవపత్రం ప్రధానం చేశారు. రాష్ట్ర గవర్నర్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి లకు జిల్లా అధికారులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

## - గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిర్పూర్

## - ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 29 : జిల్లాలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు వినతి పత్రాన్ని అందజేశారు.కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజనుల హక్కులకు సంరక్షకులుగా గవర్నర్ వ్యవహరిస్తారని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక అనేకమంది గర్భిణీ స్త్రీలు సకాలంలో ఆసుపత్రుల్లో చేరలేక పోతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులను దామాషా నిష్పత్తి ప్రకారం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో వైన్ షాపులను కట్టడి చేయాలని, లోక్ భవన్లో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విటల్, కలెక్టర్ హరిత, గవర్నర్ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఎస్పీ నికితా పంత్, ఐటిడిఏ పి.ఓ మకరందు తదితరులు పాల్గొన్నారు.




# కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పి జీవో ప్రతుల దగ్ధం

## - ఏఐ కెఎంఎస్ ధర్నా నిరసన - జీవో రద్దు చేయాలనే డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 29 : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో శుక్రవారం అఖిలభారత రైతుకూలీ సంఘం. కిసాన్ మోర్చా సంయుక్త పిలుపు మేరకు ఏఐకేఎంఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చంద్రయ్య ఉపాధ్యక్షులు కొల్లూరు మల్లేష్ ఆధ్వర్యంలో రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ ఎంఎస్‌పి జీవోకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన ప్రకటించారు. అనంతరం చంద్రయ్య మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన వ్యవసాయ విద్యుత్ విబిజి రాంజీ ఉపాధి హామీ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వరి ధాన్యానికి కేవలం 72 రూపాయల మాత్రమే పెంచి రైతులను అవమానించారని ఆరోపించారు. రైతే రాజని ప్రకటిస్తూ రైతుల వెన్ను పూసలు విరిచి వారి బతుకుల్లో నిప్పులు పోస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను మార్చుకొని రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా నిరసన కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఐ.రాజేశం, గుండేటి మల్లేశం, ఆలకుంట దేవయ్య, ఎల్ శంకర్, రాజ కొమురయ్య, రెబ్బ రాయలింగు, పానుగంటి మల్లయ్య, ఉమామహేశ్వరరావు, ఇండిబిల్లి ఏసు, కన్నె మురళి, మాడస్వామి బాబు తదితరులు పాల్గొన్నారు.





# బొగ్గు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## - సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి - ఆర్జీటూ ఏరియా సీహెచ్‌పీ సందర్శన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని, మే 29 : బొగ్గు నాణ్యత ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు రవాణా ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి అధికారులకు సూచించారు. గురువారం ఆర్జీ-2 ఏరియాలోని సీహెచ్‌పీని సందర్శించిన సీఎండీ బొగ్గు రవాణా, నాణ్యత నిర్వహణపై అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వినియోగదారులకు మెరుగైన నాణ్యత గల బొగ్గు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్త సీహెచ్‌పీ బంకర్ పనులను స్వయంగా పరిశీలించారు. బంకర్ సామర్థ్యం, అక్కడి నుంచి బొగ్గు రవాణా విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అధికారుల వివరాల ప్రకారం, అధునాతన సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ సీహెచ్‌పీ అక్టోబర్-2026 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ సాంకేతికత ద్వారా క్రషింగ్ అయ్యే బొగ్గు నాణ్యత మరింత మెరుగుపడటంతో పాటు, టన్నుకు సుమారు రూ.30 వరకు సంస్థకు ఆదా అయ్యే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ ఉ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, హెచ్‌పీ ఇంజనీర్ నీరటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేసిన మిరియాల అశోక్‌రావుకు ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని, మే 29 : సింగరేణి ఆర్జీ-1 టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్‌గా సేవలందించిన మిరియాల అశోక్‌రావు పదవీ విరమణ సందర్భంగా సింగరేణి ఈపీ ఆపరేటర్స్ అండ్ ఆల్ ట్రేడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శాలువా కప్పి, పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించి సేవలను కొనియాడారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మిరియాల అశోక్‌రావు సింగరేణి సంస్థలో ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ముఖ్యంగా టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేసిన కాలంలో యువ ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలు, పనితీరు మెరుగుదలకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, సహోద్యోగులతో స్నేహపూర్వ కంగా మెలుగుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. తనకు అందించిన గౌరవానికి మిరియాల అశోక్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థలో పనిచేసిన అనుభవాలు జీవితాంతం గుర్తుండిపోతాయని, సహోద్యోగుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐరేణి ఉదయ్‌కుమార్, భూస శ్రీనివాస్ గౌడ్, చంద్రమౌళి, ఎలక్ట్రీషియన్‌లు, డ్రిల్ ఆపరేటర్లు, కార్మిక నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 29 : నిర్మల్ జిల్లాలో ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ (టూ=హా) రైస్ మిల్లుతో పాటు కడెం మండలంలోని లక్ష్మీ అన్నపూర్ణ రైస్ మిల్లు, నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం, రోజువారీ సగటు అన్లోడింగ్ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిల్లుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. స్థానిక అధికారులు రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలు, సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.









# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

## - వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి - రూ.3.40 కోట్ల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే - రూ.83 కోట్ల బ్యాంక్ లింకేజీతో మహిళల సాధికారత... ఇందిరమ్మ చీరల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 29 : మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం వనపర్తి పట్టణంలోని దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.3.40 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కులను పంపిణీ చేయడంతో పాటు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ తొలి సంతకం చేసినట్లు గుర్తు చేశారు. ఒక్క వనపర్తి జిల్లాలోనే మహిళల ఉచిత ప్రయాణానికి ఇప్పటివరకు రూ.30.29 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మహిళల ఆర్థిక సాధికారత కోసం రూ.83.76 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. త్వరలో మహిళల కోసం డీజిల్ బంక్, సూపర్ మార్కెట్, రైస్ మిల్లు, గోదాములు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమన్నారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. మహిళా సంఘ సభ్యురాలు ప్రమాదవశాత్తూ మృతి చెందితే ఆమె తీసుకున్న రుణం మొత్తం మాఫీ అయ్యేలా ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించిందన్నారు. ఇప్పటికే జిల్లాలో మొదటి విడతలో 12,669 ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయగా, రెండో విడతలో 15 వేల చీరలను మహిళలకు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళల చేతుల్లో కుటుంబ బాధ్యతలు ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, అందుకే అన్ని సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆరోగ్య భీమా పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, జిల్లాలో 30 వేల కొత్త తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి రేషన్ కార్డుపై ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

వనపర్తి నియోజకవర్గంలో పేదలందరికీ పక్కా ఇండ్లు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే 546 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్లాట్లు లేని నిరుపేదలకు 1000 ప్లాట్లు మంజూరు చేసి, అక్కడ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ చెక్కులు, ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కదిరి రాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఉపాధి కూలీలకు టోపీలు పంపిణీ

## - తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపాధి హామీ కూలీలు కొంత ఉపశమనం పొందేలా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ముందుకొచ్చారు. గ్రామంలో పనిచేస్తున్న దాదాపు 100 మంది గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు తన స్వంత ఖర్చులతో టోపీలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పనులు చేసే కూలీలు టోపీలు ధరించడం ద్వారా వడదెబ్బ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని సూచించారు. కూలీల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దినకర్, పిఆర్ఏఈ శ్యామ్‌సుందర్‌రెడ్డి, సామాజిక వేత్త డా. ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 3వ తేదీన జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశాలు

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 29 : రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం జూన్ 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం జూన్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, బీమా సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధులతో, సాయంత్రం 4 గంటలకు పోలీసు, ఆబ్కారీ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవనంలో నిర్వహించడం జరుగుతుం దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద కేసులు, ఎన్.ఐ. యాక్ట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# కాలంతో పోరాడలేక చతికల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్–బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ–షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ధి పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా, దేశంలోని అనేక రాష్ట్రా ల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూ నిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశా యి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదా స్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండ డుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించ లేక పోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశాల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925 లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్ఎస్ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచు కుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుం డటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951–52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజ యాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్పగా చెప్పు కొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సుమారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించి నట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయ తత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలి ప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించ టం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# ఆర్టీసీ విలీన గండం

## కార్మిక హక్కులు - ప్రభుత్వ పరిమితుల మధ్య

# నలుగుతున్న రవాణా రంగం

## సామాన్యుడి రథం.. సంక్షోభాల పథం: తెలంగాణ ఆర్టీసీ విలీన డిమాండ్‌పై ప్రత్యేక కథనం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ రాష్ట్ర సాకారంలోనూ, ఆపై ప్రజా బాహుళ్యానికి అనునిత్యం వారధిగా నిలవడంలోనూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) పాత్ర అనన్య సామాన్యం. అయితే, స్వరా ష్ట్రంలో ఈ అక్షయ రవాణా పాత్ర ప్రస్తు తం తీవ్ర అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ కార్మిక వర్గాల నుంచి మరో సారి పెను తుఫానులా దూసుకొస్తోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2ను గడువుగా విధిస్తూ, ఆలోగా ప్రభుత్వం స్పష్టమైన, సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షలకు, అవసరమైతే సార్వత్రిక సమ్మెకు వెనుకాడ బోమని ఆర్టీసీ కార్మిక సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయ, పరిపాలనా వర్గాలలో తీవ్ర సంచలనాన్ని రేకెత్తించింది. అప్పుల ఊబి, ఆర్థిక లోటు, ఉద్యోగ భద్రతపై ఆందోళనల నడుమ కొట్టుమిట్టాడుతున్న సంస్థకు ఈ తాజా పరిణామాలు గండప్రాయంగా మారాయి. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు, ప్రభుత్వ ఆర్థిక పరిమితుల మధ్య నలుగుతున్న ఆర్టీసీ సంక్షోభాన్ని చారిత్రక పూర్వాపరాలు, ప్రస్తుత ఆర్థిక గణాంకాల వెలుగులో నిశితంగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్టీసీ ఉద్యోగుల సుదీర్ఘ పోరాటంలో ప్రధానంగా రెండు డిమాండ్లు అంతర్లీనంగా వినిపిస్తున్నాయి. మొదటిది తిరుగులేని ఉద్యోగ భద్రత, రెండోది ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన హోదా, వేతన భత్యాలు. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక సంస్థగా ఆవిర్భవించి నప్పటికీ, నాటి నుంచి నేటి వరకు ఆదాయ వ్యయాల మధ్య అగాధం పెరుగుతూనే వచ్చింది తప్ప తగ్గలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్ స్థాయులను బట్టి నిరంతరం పెరగడం, సమాంతరంగా ప్రైవేట్ రవాణా రంగం నుంచి అక్రమ రవాణా రూపంలో ఎదురవుతున్న పోటీ, గ్రామీణ ప్రాంతాల్లో సొంత వాహనాల వినియోగం పెరిగి ప్రయాణికుల సంఖ్య తగ్గడం వంటివన్నీ సంస్థను క్రమంగా కుంగదీశాయి. దీనికి తోడు, ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వివిధ ఉచిత రవాణా సౌకర్యాల తాలూకు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందక పోవడం సంస్థ పతనానికి ఆజ్యం పోసింది. ఈ దీర్ఘకాలిక రుగ్మతలకు కేవలం ప్రభుత్వంలో విలీనం మాత్రమే ఏకైక మరియు శాశ్వత సంజీవని అనేది కార్మిక సంఘాల గట్టి నమ్మకం.

సంస్థ పరిమాణాన్ని, దాని సేవా విస్తృతిని గమనిస్తే, తెలంగాణ ఆర్టీసీలో ప్రస్తుతం దాదాపు 43 వేల మంది కార్మికులు, ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉన్న 97కు పైగా డిపోలు, దాదాపు 9 వేల పైచిలుకు బస్సుల ద్వారా ఈ సంస్థ ప్రతిరోజూ సుమారు 50 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరుస్తోంది. ఇంతటి భారీ ప్రజా బాహుళ్యంతో ముడిపడి ఉన్న సంస్థ ఆర్థిక స్థితి మాత్రం అత్యంత దయనీయంగా మారింది. సంస్థ సంచిత నష్టాలు మరియు అప్పులు వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. రోజువారీ వచ్చే రాబడి కేవలం డీజిల్ ఖర్చులు, వాహనాల నిర్వహ ణకే సరిపోతుండగా, ఉద్యోగుల వేతనాలు, పాత బాకీలు, రిటైరైన వారి పెన్షన్ల చెల్లింపులు సంస్థకు తలకు మించిన భారంగా పరిణ మించాయి. ఇటువంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ హోదాలో ఉంటూ వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకునే పరిమితి కూడా దాటిపోవడంతో, సంస్థ మనుగడే ప్రశ్నార్థకమైంది.

ఈ విలీన డిమాండ్ వెనుక 2019 నాటి చారిత్రాత్మక సమ్మె తాలూకు చేదు జ్ఞాపకాలు, ఆవేదనలు దాగి ఉన్నాయి. నాడు సుమారు 52 రోజుల పాటు సాగిన సుదీర్ఘ సమ్మె రాష్ట్ర రవాణా రంగాన్ని పూర్తిగా స్తంభింపజేసింది. ప్రభుత్వంలో విలీనం చేయా లన్న ప్రధాన డిమాండ్‌తో సాగిన ఆ పోరాటాన్ని అప్పటి ప్రభుత్వం అత్యంత కఠినంగా అణచివేసే ప్రయత్నం చేసింది. 'సెల్ఫ్ డిస్మిస్' ప్రకటనలు, కార్మికులపై క్రమశిక్షణా చర్యలు, జీతాల నిలిపివేత వంటి చర్యలతో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఆ వేదన భరించలేక, భవిష్యత్తు శూన్యమనే ఆందోళనతో సుమారు 30 మందికి పైగా ఆర్టీసీ కార్మికులు గుండెఆగి, మరికొందరు ఆత్మహత్య లు చేసుకుని ప్రాణా లు కోల్పోయారు. చివరకు కోర్టుల జోక్యం, కొన్ని తక్షణ హామీలతో సమ్మె విరమించినప్పటికీ, మూల సమస్య అయిన విలీనం మాత్రం అప్పట్లో కాగితాలకే పరిమితమైంది. ఆ గాయాలు, ఆవేదనలు కార్మిక వర్గాల్లో నేటికీ పచ్చిగానే ఉన్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత తమ సమస్యలకు శాశ్వత మోక్షం లభిస్తుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. ఈ పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య, ముఖ్యంగా మహిళల రద్దీ అసాధా రణంగా పెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. అయితే, నాణేనికి మరోవైపు ఉన్న ఆర్థిక కోణాన్ని పరిశీలిస్తే, ఈ ఉచిత ప్రయాణాల వల్ల సంస్థకు రావాల్సిన ప్రత్యక్ష ఆదాయం నిలిచి పోయింది. ప్రభుత్వం నుంచి అందాల్సిన రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో, పూర్తిస్థాయిలో విడుదల కాకపోతే రోజువారీ నిర్వహణ వ్యయాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ పెరిగినా సంస్థ చేతిలో నగదు కొరత వేధిస్తుం డటం విలీన డిమాండ్‌కు మరింత ఊతాన్నిచ్చింది.

కార్మిక జేఏసీ నాయకత్వం విలీనానికి చూపుతున్న కారణాలు కేవలం ఆర్థికపరమైనవి మాత్రమే కావు, అవి నైతికమైనవి కూడా. ఆర్టీసీ కార్మికులు కేవలం రవాణా సేవలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే సార్వత్రిక ఎన్నికల విధులు, అత్యవసర సేవల నిర్వహణ, వరదలు, తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో సహాయక చర్యల్లో ప్రాణాలకు తెగించి పాల్గొంటున్నారు. సమ్మక్క–సారలమ్మ జాతర, దసరా, సంక్రాంతి వంటి పండుగల సమయాల్లో రాత్రింబవళ్లు అదనపు సర్వీసులు నడుపుతూ ప్రభుత్వ యంత్రాంగంలో భాగస్వాములవుతున్నారు. ఇంతటి కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమకు లభించే వేతనాలు, పదోన్నతులు, ముఖ్యంగా పదవీ విరమణ తదనంతర పెన్షన్ భద్రతలో తీవ్ర వివక్ష, అస్పష్టత ఎదురవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయినప్పటికీ, ప్రభుత్వ కోణం నుంచి చూస్తే దీని వెనుక పెను ఆర్థిక, పరిపాలనాపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. ఒక కార్పొరేషన్ సంస్థను పూర్తిగా ప్రభుత్వ శాఖగా మార్చడం లేదా ఉద్యోగులను ప్రభుత్వ పరిధిలోకి విలీనం చేయడం అంత సులభ తరమైన ప్రక్రియ కాదు. 43 వేల మంది ఉద్యోగుల జీతభత్యాలు, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ల బాధ్యతను నేరుగా రాష్ట్ర బడ్జెట్‌పై వేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఉచిత విద్యుత్, రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టుల రుణాల చెల్లింపుల వంటి భారీ సంక్షేమ పథకాల వల్ల రాష్ట్ర ఖజానా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ తరుణంలో ఆర్టీసీకి ఉన్న వేల కోట్ల రూపాయల అప్పులను, భవిష్యత్ ఆర్థిక భారాలను ప్రభుత్వం తన నెత్తిన వేసుకోవడానికి తీవ్రంగా మథన పడుతోంది. చట్టపర మైన చిక్కులు, ఇతర కార్పొరేషన్ల (విద్యుత్, సింగరేణి వంటివి) నుంచి కూడా ఇటువంటి డిమాండ్లు వచ్చే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం ఈ విషయంలో అడుగులు చాలా జాగ్రత్తగా వేస్తోంది.

ఈ మొత్తం వ్యవహారంలో సామాన్య ప్రజల, ప్రజా సంఘాల




అభిప్రాయాలు భిన్న కోణాల్లో వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సే ఏకైక జీవననాడి. ప్రైవేట్ వాహనదారులు లాభాలు లేని రూట్లలో సర్వీసులు నడపడానికి సుముఖత చూపని తరుణంలో, నష్టాలు వస్తున్నా సామాన్యుడి కోసం ఆర్టీసీ మాత్రమే బస్సులు నడుపుతోంది. విద్యాభ్యాసం కోసం పట్టణాలకు వెళ్లే విద్యార్థులు, కూరగాయలు అమ్ముకునే చిన్న వ్యాపారులు, కూలీలు పూర్తిగా ఆర్టీసీ పాస్‌లపైనే ఆధారపడి ఉన్నారు. ఈ రవాణా వ్యవస్థ గనుక సమ్మెల రూపంలో స్తంభిస్తే సామాన్య జనజీవనం అతలాకుతల మవుతుంది. గత సమ్మెల కాలంలో ప్రైవేట్ వాహనాలు సామాన్యులను దోచుకున్న ఉదంతాలను ప్రజలు మరిచిపోలేదు. కాబట్టి, సమ్మెల వల్ల ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టకుండా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో, ఒకవేళ కార్మిక సంఘాలు ప్రకటించినట్లుగా జూన్ 2 తర్వాత ఉద్యమం ఉధృతమై, బస్సులు నిలిచిపోతే అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై, శాంతిభద్రతలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. రాజకీయ పార్టీలు సైతం ఈ సున్నితమైన అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రతిపక్షాలు కార్మికుల డిమాండ్లకు మద్దతు ప్రకటిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుండగా, అధికార పక్షం ఇటు కార్మికులను నొప్పించక, అటు ఖజానాను ఇబ్బంది పెట్టని మధ్యేమార్గం కోసం అన్వేషిస్తోంది. తెలంగాణ ఆర్టీసీ సమస్య అనేది కేవలం కొందరు ఉద్యోగుల జీతభత్యాల సమస్య మాత్రమే కాదు; ఇది రాష్ట్ర సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థ భవిష్యత్తుకు సంబంధించినది. పాలకుల విధానాలు, సరైన ప్రణాళికా లోపం వల్లనే ఒకప్పుడు లాభాల్లో నడిచిన సంస్థ నేడు ఈ స్థితికి చేరిందనే విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా, ఒకవైపు దశాబ్దాలుగా సేవలందిస్తున్న కార్మికుల సామాజిక, ఆర్థిక భద్రతను కాపాడటం, మరోవైపు రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ ప్రజా రవాణాను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. ఇందుకు సమ్మెలు, ఘర్షణ పూరిత వాతావరణం ఎంత మాత్రం పరిష్కారం కాబోవు. ప్రభుత్వం తక్షణమే కార్మిక ప్రతినిధులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, నిర్దిష్ట కాలపరిమి తిలోగా విలీనం లేదా ప్రత్యామ్నాయ పటిష్ట ఆర్థిక ప్యాకేజీ ద్వారా సంస్థను గట్టెక్కించే కార్యాచరణను ప్రకటించాల్సి ఉంది. పరస్పర పట్టింపులకు పోకుండా, పారదర్శక చర్చల ద్వారానే తెలంగాణ రవాణా రంగానికి, కార్మికులకు శాశ్వత విముక్తి లభిస్తుంది.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# అక్రమ వలసదారులకు మమత చేయూత

## - తృణమూల్ నేతలో ఊతకర్ర అందించిన వైనం - సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 29 : మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కనపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్టల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు. ఇండియా టుడే కథనం మేరకు.. బంగ్లాదేశ్ తిరిగి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తున్న అక్రమ వలసదారులు మీడియాతో మాట్లాడుతూ దేశంలోకి ఎలా వచ్చారో చెప్పారు. కొంతమంది తాము నదులు దాటి భారత దేశంలోకి ప్రవేశించామని చెప్పారు. మరి కొంతమంది తాము మధ్యవర్తుల ద్వారా ఇండియాలోకి వచ్చామన్నారు. చీకటిలో సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించామని తెలిపారు. మధ్యవర్తుల సాయం ఉంటే 10 నిమిషాల్లో దేశంలోకి ప్రవేశించవచ్చని ఓ అక్రమ వలసదారుడు మీడియాకు తెలిపాడు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో పని చేసే కొంతమంది కార్యకర్తల సాయంతో తాము భారత దేశంలోకి వచ్చామని, వారే తమకు అన్ని డాక్యుమెంట్లు తయారు చేసి ఇచ్చారని వెల్లడించారు. డాక్యుమెంట్ల కారణంగా తాము భారత్‌లో పలు పథకాల ద్వారా డబ్బులు పొందామని, ఓట్లు కూడా వేశామని చెప్పారు. బంగ్లాదేశ్‌లోని కుస్తియా జిల్లాకు చెందిన ఓ కార్పెంటర్ మాట్లాడుతూ.. 'నేను ఇండియాలోకి రావడానికి మధ్యవర్తికి 7 నుంచి 8 వేల రూపాయలు ఇచ్చాను. ఆ మధ్యవర్తి బీఎస్ఎఫ్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటాడు. రాత్రి పూట బీఎస్ఎఫ్ సిబ్బంది లేని సమయంలో పెద్ద సంఖ్యలో జనాలను ఇండియాలోకి పంపుతాడు' అని చెప్పాడు. తాను ఏజెంట్‌కు 20 వేల రూపాయలు ఇచ్చి భారత్‌లోకి వచ్చానని బెంగళూరులో ఉంటున్న ఓ అక్రమ వలసదారుడు మీడియాతో చెప్పాడు. ఇలా పుంఖాను పుంఖానులుగా కథనాలు వెలువడుతున్నాయి.

# రాంనగర్ 13వ వార్డులో ఉచిత మెడికల్ క్యాంప్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 29 : రాంనగర్ 13వ వార్డులో ఈరోజు ఉదయం 9 గంటలకు ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ముఖ్యంగా షుగర్, బీపీ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా ఎక్స్–రే పరీక్షలు కూడా చేపట్టారు. ఈ మెడికల్ క్యాంప్‌కు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించగా, దాదాపు 100 మంది ప్రజలు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బొడ్డుపల్లి పరుశురాం, టీబీ సూపర్వైజర్ రమాదేవి, ఎక్స్–రే టెక్నీషియన్ ఎం.డి. వహీద్, హెల్త్ అసిస్టెంట్లు జే. గోవిందరావు, జి. శాంతిభూషణ్, ఏఎన్ఎం శివపార్వతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

## - రైతులు అధైర్యపడొద్దు :: మంత్రి జూపల్లి కృష్ణారావు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 29 : అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయిన నేపథ్యంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి గోదాములకు తరలిస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి వీపనగండ్ల మండల కేంద్రం, కేతేపల్లి శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలించి రైతుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు లారీల కొరత సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా, జిల్లాలో ఇసుక, ఫ్యాక్టరీల కోసం వినియోగిస్తున్న లారీలను సైతం ధాన్యం తరలింపునకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా వీపనగండ్ల, పానగల్ ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాలకు అత్యవసరంగా లారీలను తరలించాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్ మిల్లులకు తరలించాలని ఆదేశించిన మంత్రి, రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని తెలిపారు. కేతేపల్లి శివారులోని కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్న విషయంపై మంత్రి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేసి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం చేస్తే ఎవరిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లు రైతులను మోసం చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం మెహ్రాన్ ఇండస్ట్రీస్‌ను సందర్శించిన మంత్రి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. వీపనగండ్లలో ధాన్యం నిల్వకు అనుకూలంగా ఉన్న గోదామును మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లా, మే 29 : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్వహించే వేడుకలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమ వేదికను పూలతో అందంగా అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. అలాగే అవసరమైన ఏర్పాట్లు, అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, వివిధ శాఖలకు సంబంధించిన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో ఆయా శాఖలు తమ శాఖల ప్రగతి నివేదికలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి (డీఈఓ) సూచించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) సునీల్, జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి దవాఖానను రెనె హాస్పిటల్‌కు ఎంతకు అమ్మారు...!?

## - కార్డియాక్ సెంటర్ పేరు మార్చాలి

## - ఎచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), మే 29 : సింగరేణి కంపెనీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల కోసం నిర్మించిన క్యాత్ లాబ్ సెంటర్ పేరును సింగరేణి రెనే అని పేరు పెట్టడం దుర్మార్గమైన చర్య అని ఎచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మండిపడ్డారు. శుక్రవారం సింగరేణి రేనే క్యాత్ లాబ్ ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. ఇది సింగరేణి కంపెనీ దవాఖానలను కనుమరుగు చేయడానికి చేసే కుట్ర లాగా కనపడు తుందన్నారు. సింగరేణి రెనే కార్డియాక్ కేర్ సెంటర్ పేరులో నుండి రెనే పేరును వెంట నే తొలగించాలి. రెనే అని పెట్టడానికి ఎన్ని డబ్బులు తీసుకున్నారని యాజమాన్యాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రెనే హాస్పిటల్ పేరు వెంటనే తొలగించుకుంటే వారం తరువాత మేమే ఆ పేరుని తొలగిస్తామన్నారు. గెలిచిన సంఘం నాయకుని ఇంట్లో రాత్రి కరెంట్ పోయిందని చెప్పగానే ఎలక్ట్రీషియన్ నీ నైట్ షిఫ్ట్ లో పెట్టడంసరికాదన్నారు.సింగరేణి లో ఎక్కడా కూడా ఇది లేదని ఒక ఎలక్ట్రీషియన్ నీ నైట్ షిఫ్ట్ లో పెట్టాలంటే ఒక హెల్పర్, మ్యాన్ వే క్లర్క్ జీకే, నైట్ షిఫ్ట్ అలోవెన్స్ వారికి అన్ని సదుపాయాలు కూడా కల్పించా లన్నారు. ఎవరో నాయకుని కోసం సిస్టమ్‌ను మార్చడం సరికాదన్నారు. ఈ కార్య క్రమంలో ఎచ్ఎంఎస్, ఎఐఎఫ్‌టియు, టిఎన్‌టియుఎస్ ఇఫ్ట్ నాయకులు రియాజ్ అహ్మద్, విశ్వనాథ్, రాయమల్లు, మిట్టపల్లి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి, రాయమల్లు రీజినల్ వైస్ ప్రెసిడెంట్, పల్లె క్రాంతి కుమార్, బ్రాంచ్ సెక్రెటరీ, శాంతి స్వరూప్, వైస్ ప్రెసిడెంట్, దుర్గం శ్రీనివాస్, రాంచందర్ రావు, వరప్రసాద్ రావు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

## - ఎసై సత్యనారాయణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 29 : మెదక్ జిల్లా,హవేలిఘనపూర్ మండల కేంద్రంలో సీడ్స్ & ఫర్టిలైజర్ షాపుల్లో శుక్రవారం రోజు ఎసై సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో ఎంఆర్ఓ,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్ తదితర రికార్డులను పరిశీలించి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎసై సత్యనారాయణ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు,కాలం చెల్లిన ఉత్పత్తులతో రైతులను మోసం చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు,ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని సూచించారు. నాణ్యతలేని లేదా కాలం చెల్లిన విత్తనాలు కొనుగోలు చేయవద్దని అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు లేదా పురుగుమందులు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తరచుగా షాపులపై తనిఖీలు కొనసాగుతాయని, రైతులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

## కలెక్టర్ అనురాగ్ జయంతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ప్రతి రోజు ఓపీకి వచ్చే రోగుల సంఖ్య, వారికి అందుతున్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారనీ, వైద్యులు, సిబ్బంది రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారా లేదా అని వివరాలు సేకరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైద్యాధికారులతో చర్చించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగాఅడిగి తెలుసు కొని, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ నెలలో పీహెచ్‌సీలో జరిగిన ప్రసవాలు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదైన డెలివరీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు మరింత పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రజల్లో ప్రభుత్వ దవాఖానలపై విశ్వాసం పెంపొందించాలని అన్నారు. ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) రోగుల పర్యవేక్షణపై కూడా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నిరంతరం ఫాలోఅప్ నిర్వహించాలని సూచించారు. ప్రతి నెల పీహెచ్‌సీల పనితీరుపై సమీక్ష నిర్వహించి, సిబ్బంది పనితీరుకు రేటింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత వైద్య సిబ్బందిపైనే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రైతు పండించిన వరి ధాన్యని తక్షణమే కొనుగోలు చేయాలి


## - బీఆర్ఎస్ మండల నాయకులు భక్తుల వీరప్ప, నాయికోటి భాస్కర్ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్, మే 29 : రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, వరి ధాన్యం కొనుగోలులో జాప్యంపై టేక్మాల్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా, రైస్ మిల్లర్లు ధాన్యం లోడ్ చేసిన ట్రాక్టర్లను వెనక్కి పంపిస్తున్నారని ఆరోపిస్తూ.. రైతులు శుక్రవారం స్థానిక టేక్మాల్ చౌరస్తాలో బోడ్మట్ పల్లి - మెదక్ ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వ తీరుపై భగ్గుమన్న రైతులు, ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప. నాయికోటి భాస్కర్ లు మాట్లాడుతూ, "రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సారికదాని ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలి. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమం చేపడతాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం కార్యదర్శి నాయికోటి భాస్కర్,జిల్లా నాయకులు రమేష్ నాయక్. ఆంజనేయులు. చందర్ బాలరాజు తదితరులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. నిరసన కొనసాగుతున్న నేపథ్యంలో,టేక్మాల్ ఎస్సై అరవింద్ కుమార్. పోలీస్ సిబ్బంది మరియు. రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు..

# తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## - అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి సన్నాహక సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 2న జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అతిథులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలని సూచించారు. ప్రోటోకాల్ నిబంధనలను పాటిస్తూ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ఇతరుల కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశ పత్రాలను సీపీఓ సిద్ధం చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించిన కలెక్టర్.. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అమరవీరుల స్థూపం, ప్రధాన వేదిక అలంకరణలను ప్రత్యేకంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 29 : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎన్యూమరేషన్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుధర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు ఎస్ఐఆర్ షెడ్యూల్, నిర్వహణ విధానంపై అవగాహన కల్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వనపర్తి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్పష్టమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపట్టనున్నారని, అలాగే ఓటర్లు ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూపర్‌వైజర్లతో సమావేశమై, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ఎన్యూమరేషన్ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి సూపర్‌వైజర్ తమ పరిధిలోని పనులను సమర్థవంతంగా నిర్వహించి ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట కొండపై దుకాణాలకు టెండర్లు నిర్వహించాలి : వర్తక సంఘం ఆగడాలపై ఫిర్యాదు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై ఉన్న దుకాణాలను పారదర్శకంగా టెండర్ల ద్వారా కేటాయించాలని యాదగిరిగుట్టకు చెందిన అన్నల్దాస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. వర్తక సంఘం పేరిట కొందరు వ్యాపారులు గుత్తాధిపత్యం కొనసాగిస్తూ దేవస్థానానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శ్రీ కనకదుర్గ దేవి వేషధారణలో కళాకారులతో కలిసి హైదరాబాద్ లో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కొండపై ఉన్న 10 దుకాణాలను టెండర్ల ద్వారా కేటాయిస్తే సుమారు రూ.30 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొందరు వ్యాపారులు టెండర్ గడువు ముగిసినా రెన్యువల్ పేరుతో కొనసాగుతున్నారని విమర్శించారు. గతంలో టెండర్ల ద్వారా పొందిన దుకాణాలను ఇతరులకు లీజ్, సబ్లీజ్‌లుగా ఇచ్చి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వర్తక సంఘం పేరుతో భక్తులను, దేవస్థానాన్ని దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేలా వెంటనే టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి పారదర్శకంగా దుకాణాల కేటాయింపు చేపట్టాలని కోరారు.

# దివ్యాంగ పిల్లలకు ఆత్మవిశ్వాసం కల్పించడం ఎంతో ముఖ్యం

## - కలెక్టర్ అనురాగ్ జయంతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలు, పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రస్తుతం ఉన్న పిల్లల సంఖ్య, వారి వయస్సులు, వారికి అందిస్తున్న సంరక్షణ, శిక్షణ కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. పిల్లల విద్య, పునరావాస సేవలు, ప్రత్యేక శిక్షణ కోసం పనిచేస్తున్న సిబ్బంది వివరాలను కూడా తెలుసుకున్నారు. అనంతరం కేంద్రానికి నిర్మిస్తున్న నూతన భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకొని, భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కేంద్రానికి అవసరమైన సదుపాయాలపై ఆరా తీసి, అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో కేంద్రం నుంచి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రోత్సహించారు. దివ్యాంగ పిల్లలకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం



## రైతులకు ఉచిత స్ప్రే పంపులను పంపిణీ చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 29 : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్సార్ నిధులతో రైతులకు ఉచితంగా స్ప్రే పంపుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెల్లికుదురు లో జరిగింది.జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని నెల్లికుదురు, కేస ముద్రం, ఇనుగుర్తి మండలాల రైతులకు స్ప్రే పంపులను అందజే శారు. హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో రెండవ విడతగా ఉచిత స్ప్రే పంపుల పంపిణీ చేయడం చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు .ఇదే విధముగా రానున్న రోజుల్లో జిల్లాలోని రైతులందరికి అందేవిధముగా కృషి చేస్తానని అన్నారు.ఈ సందర్భంగా యూనియ న్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తీసుకుంటామని హెచ్చరించారు.

## టేక్మాల్‌లో పలు ఫర్టిలైజర్ల కేంద్రాలలో తనిఖీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ మే 29 : మండల పరదిలోని రైతు సేవ కేంద్రం, రైతు ఆగ్రోస్ ఇతర ఫర్టిలైజర్ కేంద్రాలను మండల వ్యవసాయా ధికారి రాంప్రసాద్ సమక్షంలో స్థానిక మండల తహసిల్దార్ తులసీరామ్, ఎస్సై అరవింద్ కుమార్ ఫర్టిలైజర్లను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఫర్టిలైజర్లలో పలు రికార్డులను తనిఖీ చేసి సూచనలు అందించారు. అనంతరం మండల తాసిల్దార్ తులసి రామ్, ఎస్సై అరవింద్ కుమార్‌లు మాట్లాడుతూ... ప్రభుత్వ నిబం ధనల ప్రకారం విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.కచ్చితంగా నిర్వాహకులు స్టాక్ బోర్డును తూచా తప్పక పెట్టాలన్నారు.నకిలీ విత్తనాలు అమ్మితే షాప్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనల మేరకు షాపు నిర్వాహణ పత్రాలు సరిగ్గా ఉండాలనిసూచించారు. యూరియా ఆన్లైన్ ఓపెన్ అయిన తర్వాత నిబంధనలకు లోబడి పంపిణీ చేయాలన్నారు.



## కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 29 : మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 122 చెక్కులు, సీఎంఆర్ఎఫ్ 44 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మురళి నాయక్ పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగుల్ జ్యోతి రమేష్ నాయక్, మండల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ సీనియర్ నాయకులు లబ్ధిదారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మొదటి వెయ్యి రోజుల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 29 : మేడిపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఐసిడిఎస్ ఆధ్వ ర్యంలో మొదటి వెయ్యి రోజుల ప్రాధాన్యతపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మకిలి దాస్ మాట్లాడుతూ..గర్భధారణ ప్రారంభం నుండి బిడ్డ రెండు సంవత్సరాలు పూర్తి అయ్యే వరకు ఉన్న కాలం ఎంత ముఖ్యం అనేది తెలుపుతూ పోషకాహారం తీసుకోవడం గురించి వివరించారు. మెడికల్ ఆఫీసర్ రమ మేడం వ్యక్తిగత పరిశుభ్రత గురించి, తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఎన్జీఓ శ్యామల బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మకిలీ దాస్, ఉప సర్పంచ్ తోపారపు అర్జున్, వార్డ్ సభ్యులు సుజాత, మానస, మెడికల్ ఆఫీసర్ రమ మేడం, ఎన్జీఓ శ్యామల మేడం, ఐసీడీఎస్ సూపర్వైజర్ లు పైని మాధ్యూ, భాగ్యలక్ష్మి, వీఓఏ, భార్గవి, రమ, ఆశాలు మణెమ్మ, పుష్ప, ఎస్వేరు, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మి, స్వప్న, శారద, నర్మదా, గీత, మహిళా సంఘ సభ్యులు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విభాగాలు ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 29 : భీమారం మండలంలోని ఎంపీపీఎస్ మన్నెగూడెం, ఎంపీపీఎస్ రాగోజీపేట్, ఎంపీపీఎస్ గోవిందారం, ఎంపీపీఎస్ ఒడ్యాడ్ పాఠశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రీ–ప్రైమరీ విభాగాలు ప్రారంభించబడినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎల్లా మధుసూదన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం ప్రీ–ప్రైమరీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఈ విభాగాలను మంజూరు చేసినందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాలల్లో ప్లే మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్, వివిధ రకాల టీఎల్ఎంస్ తో చిన్నారులకు ఆనందభరితమైన బోధన అందించ బడుతుందని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ చిన్నారులను సమీప ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అలాగే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# దత్తాయపల్లిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మార్నింగ్ వాక్

### - గ్రామ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 29 : దత్తాయపల్లి గ్రామంలో తూడి మేఘా రెడ్డి శు క్రవారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, చెరువు కట్ట, క్రీడా ప్రాంగణం, తాగునీటి ప్లాంట్, సీసీ రోడ్లు, మురికి కాలువలు, ఆలయ నిర్మాణ స్థలం తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే రైతులు పంటలు ఆరబోసుకునేందుకు సీసీ బెడ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని కూడా పరిశీలించారు. అనంతరం సమీప తండాలకు మోటార్ సైకిల్‌పై వెళ్లిన ఎమ్మెల్యే అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాల్లో మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, “ఎన్నో ఏళ్లుగా ఎమ్మెల్యేలను చూస్తున్నాం గానీ గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకున్న నాయకుడిని ఇప్పటివరకు చూడలేదు. మీరు గ్రామానికి వచ్చి ప్రజలతో మమేకం కావడం ఆనందంగా ఉంది” అంటూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ వెంకటయ్య గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి మండల అధ్యక్షుడు రవికిరణ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, సర్పంచ్ వాల్య నాయక్, వార్డు సభ్యులు ఎం.వెంకటయ్య, మల్లేష్, వెంకటేష్, జయరాములు, రామకృష్ణ, నాగశేషి, చెన్నయ్య, కుర్మయ్య, ధర్మయ్య, కే.సుదర్శన్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

### - బూత్‌ల వారీగా బీఎల్‌వోలను నియమించుకోవాలి

### - కలెక్టర్ అనురాగ్ జయంతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో శు క్రవారం నిర్వహించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఎస్ఐఆర్ (ప్రత్యేక విస్తృత సవరణ) కార్యక్రమంపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు నియోజకవర్గాల వారీగా బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్‌వోలు)ను నియమించుకుని ఎస్ఐఆర్ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. బూత్ స్థాయి ఏజెంట్లు రాజకీయ పార్టీల అధికారిక ప్రతినిధులుగా వ్యవహరిస్తూ, కార్యక్రమం పారదర్శకంగా సాగేందుకు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఇంటింటి సర్వే సమయంలో ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ బూత్ స్థాయి అధికారులకు సహాయం చేయడం, మరణించిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, నకిలీ నమోదులు గుర్తించడం, అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయడంలో బీఎల్‌వోలు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అలాగే నమోదు, తొలగింపు, మార్పుల కోసం దరఖాస్తు ఫారాలను సరైన విధంగా పూరించడంపై ప్రజలకు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో సమన్వయంగా పని చేయాలని, సవరణ సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత, ఖచ్చితత్వం పెంపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతరపల్లి గ్రామంలోని గొల్లగుడిసెలు మెయిన్ రోడ్డుపై నిర్మించనున్న కల్వర్టు పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఈ కల్వర్టు నిర్మాణంతో రాకపోకలకు భారీగా ఉపశమనం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలంలో గొల్లగుడిసెల మెయిన్ రోడ్డుపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. కల్వర్టు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలు, రైతులు, విద్యార్థులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులుకల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, తాగునీటి సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న సామాజిక కార్యకర్త మురళి

### అనాథ వృద్ధురాలికి స్వయంగా అంత్యక్రియలు నిర్వహించి ఆదర్శం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 29 : సమాజంలో బంధాలు, అనుబంధాలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో మానవత్వాన్ని చాటిచెప్పే హృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. దిక్కులేని స్థితిలో మరణించిన ఓ అనాథ వృద్ధురాలికి సామాజిక కార్యకర్త మురళి దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. స్థానికంగా నివసిస్తున్న యాదవ కులానికి చెందిన బాలకృష్ణమ్మ (85) అనే వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమెకు భర్త, పిల్లలు ఎవరూ లేకపోవడంతో పూర్తిగా అనాథ స్థితిలోనే కాలం గడుపుతోంది. ఈ క్రమంలో నిన్న రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో ఆమె తన నివాసంలోనే మృతి చెందినట్లు సమాచారం.అయితే ఆమె మరణించిన విషయం ఈరోజు ఉదయం వరకు ఎవరికీ తెలియలేదు. ఉదయం సమాచారం తెలుసుకున్న సమాజ సేవకుడు మురళి వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వృద్ధురాలి దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయిన ఆయన, ఆలస్యం చేయకుండా స్వయంగా అంత్యక్రియల బాధ్యతలు చేపట్టారు. తర్వాత కొంతమంది దూరపు బంధువులు అక్కడికి చేరుకున్నప్పటికీ, అప్పటికే మురళి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, వృద్ధురాలికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. అనాథగా మిగిలిపోయిన మహిళకు చివరి వీడ్కోలు పలికి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సమాజంలో ఇలాంటి సేవా భావం కలిగిన వ్యక్తులు ఉండటం గొప్ప విషయమని స్థానికులు పేర్కొంటూ మురళి సేవలను అభినందిస్తున్నారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడుతున్నారు.

# సామాజిక న్యాయం కోసం వనపర్తిలో భారీ బహిరంగ సభ

### - “ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా” నినాదంతో ఈనెల 31న సభ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 29 : ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో “సామాజిక న్యాయం–రాజ్యాధికారం” లక్ష్యంగా ఈనెల 31న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వనపర్తి జిల్లా కన్వీనర్లు చిలుక బాలరాజ్ సాగర్, వీరపాగ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సభ సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సభకు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. “ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా” అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ సభకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. వేల ఏళ్లుగా కొనసాగుతున్న అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు తీవ్ర అన్యాయానికి గురయ్యాయని నాయకులు ఆరోపించారు. రాష్ట్ర జనాభాలో 90 శాతం ఉన్నప్పటికీ, ఈ వర్గాలు ఇంకా అణచివేత, పేదరికం, వివక్షలోనే జీవిస్తున్నాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కొంత మార్పు వచ్చినప్పటికీ, అది సరిపోదని, నిజమైన సామాజిక న్యాయం కోసం రాజకీయ మార్పు అవసరమని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాధికారం కోసం ప్రజలు సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరాం ఆశయాల సాధన కోసం బహుజన రాజ్యం రావాలని ఆకాంక్షించారు. సామాజిక న్యాయం సాధన దిశగా ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ఈనెల 31న జరిగే సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని జేఏసీ నాయకులు అశోక్, కురుమన్న, కొండన్న యాదవ్ కోరారు.

# వలిగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

### పెట్రోలింగ్, పెండింగ్ కేసులపై అధికారులకు కీలక ఆదేశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 29 : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రిసెప్షన్ కౌంటర్, క్రైమ్ విభాగం, జనరల్ డైరీ (జీడీ) నిర్వహణను నిశితంగా పరిశీలించిన ఎస్పీ, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. దర్యాప్తు వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు చెందిన పెట్రోల్ వాహనాలు, బ్లూ కోల్ట్స్ వాహనాల పరిస్థితిని పరిశీలించి, సైరన్లు, కమ్యూనికేషన్ సెట్లు, జీపీఎస్ వ్యవస్థల పనితీరును అడిగి తెలుసుకున్నారు. నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించాలని, ప్రజల్లో భద్రతాభావం పెంచేలా విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని సూచించారు.



# ధాన్యం కొనుగోలుపై కేంద్రం నిర్లక్ష్యం

### - బిజెపి నాయకులు కొనుగోలు కేంద్రాల వద్ద డ్రామాలు
### - ఆదివాసి కాంగ్రెస్ నిర్మల్ జిల్లా
### - చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, మే 29 : తెలంగాణ రైతుల ధాన్యం కొనుగోలు పై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణవత్ గోవింద్ నాయక్ విమర్శించారు. రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకుండా, తెలంగాణ బిజెపి నాయకులు మాత్రం కొనుగోలు కేంద్రాల వద్ద డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో వారు మాట్లాడుతూ తెలంగాణ నుంచి 8 మంది బిజెపి ఎంపీలు,వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రైతుల ధాన్యం కొనుగులపై కేంద్రాన్ని ఒప్పించడంలో పూర్తిగా విఫలమైనరని విమర్శించారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే బిజెపి నేతలు రాజకీయాలు పక్కనపెట్టి కేంద్రంతో ధాన్యం కొనుగోలు చేయించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు ఆత్రం రాజేశ్వర్, వసంత్ రావ్, వెద్మ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కుభీర్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 29 : కుభీర్ మండల కేంద్రం రైతు వేదికలో శు క్రవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ లబ్ధిదారులకు అంద జేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 80 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గిం చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్థవం తంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదా రుల పాల్గొన్నరు.


## కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలి

### రామగుండం మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), మే 29 : టీచర్స్ కాలనీ లో కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి వరద కాలువ నిర్మాణ పనులు ప్రారంభించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ ఇంజనీ రింగ్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి శుక్రవారం టీచర్స్ కాలనీ, శ్రీ నగర్ కాలనీ సందర్శించారు. వర్షాకాలం సమీపి స్తున్న దృష్ట్యా అంతరాయం కలగకుండా ఉండేందుకు వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. డిఎంఎఫ్‌టి నిధులు రూ.4 కోట్లలో భాగంగా ప్రతిపాదించిన ఈ కాలువ నిర్మాణం త్వరితగతిన పూర్తయితే వర్షాకాలంలో వరద ముంపు ఉండదని అన్నారు. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జారీ చేసిన ఆదేశాల మేరకు కాలువపై వెలసిన అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలని అన్నారు. శనివారం నుండి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన వెంట కార్పొరేటర్లు వడ్లూరి రవి, గట్ల రమేష్, చిదురాల నాగరాజు, బాలసాని తిరుపతి, టి పి ఎస్.నవీన్, ఎఇ తేజస్విని తదితరులు ఉన్నారు.



## దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన కోరుట్ల ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 29 : మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్, పెద్దాపూర్ గ్రామాలతో పాటు కోరుట్ల మండలం అయిలాపూర్, చిన్న మెట్‌పల్లి గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ ఎత్తున ఈత వనాలు దగ్ధమవడంతో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్ అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టంపై బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నో సంవత్సరాల శ్రమతో పెంచుకున్న ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని, ఈ ఘటన వల్ల గౌడ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేలా సంబంధిత అధికారు లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నష్టపోయిన వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈత వనాలు జీవనాధారంగా ఉన్న కుటుంబాలు ఆందోళన చెంద వద్దని, తాను ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటానని భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాదాలకు గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.



# టాస్క్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 29: టాస్క్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువతకు నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు సాంకేతిక, ప్రాయోగిక నైపుణ్యాలు కూడా కీలకమని పేర్కొన్నారు. టాస్క్ వంటి శిక్షణా కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను సమర్థవంతంగా వినియోగించుకుని మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. సాంకేతిక విద్యతో పాటు కమ్యూనికేషన్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లోనూ అభివృద్ధి సాధిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# ల్వోసీ ద్వారా రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 29: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు జవహర్‌నగర్ కాలనీకి చెందిన మల్లెల మల్లారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన కుటుంబానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎల్‌వోసీ ద్వారా రూ. 1,50,000 ఆర్థిక సహాయం శుక్రవారం అందించారు. ఇప్పటికే మంజూరైన ఎల్‌వోసీ ద్వారా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. మల్లెల మల్లారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 29: ఖమ్మం జిల్లా కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామానికి చెందిన తూటిపల్లి జ్యోతి (38) తీవ్ర అనారోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరగా, వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి ఆమె కడుపులో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలోని వైద్య బృందం శుక్రవారం శస్త్రచికిత్స నిర్వహించింది. సుమారు నాలుగు కిలోల బరువున్న గడ్డను మహిళ కడుపులో నుంచి విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. తక్కువ వనరులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడంపై స్థానికులు వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ఈ శస్త్రచికిత్స నిలిచిందని పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు డాక్టర్ రమేష్‌తో పాటు వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో వైద్యం అందించి మహిళ ప్రాణాలను కాపాడిన వైద్యులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఈనెల 31న ఉచిత మెగా వైద్య శిబిరం

## - కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 29: మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము తెలిపారు. నగరంలోని స్వర్ణభారతి కమ్మవారి కళ్యాణ మండపంలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, నేత్ర, చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, స్త్రీరోగాలు, శిశు వైద్యం, యూరాలజీ, న్యూరో, సైకియాట్రీ తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు సేవలు అందించనున్నారు. అలాగే రక్తపరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ, ఎక్స్‌రే వంటి పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజ సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సలహాలు, పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు.

# కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యంతో చర్చించిన ఏఐటీయూసీ నాయకులు

## మైన్స్ కమిటీ సమావేశంలో భద్రత, మౌలిక వసతులు, సంక్షేమంపై ప్రధానంగా ప్రస్తావన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 29: భద్రాద్రి జిల్లా సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్లైన్‌లో శుక్రవారం నిర్వహించిన మైన్స్ కమిటీ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, గని పరిసరాల్లో మౌలిక వసతుల లోపాలు, భద్రతా ప్రమాణాలు, కార్మిక సంక్షేమ అంశాలపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో సవివరంగా చర్చించారు. సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు తగిన సంక్షేమ సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రతా ప్రమాణాలు కల్పించడం యాజమాన్య బాధ్యత అని స్పష్టం చేశారు. కార్మికుడు ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటేనే గైర్హాజరు కాకుండా విధులకు హాజరవుతూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తాడని తెలిపారు. ప్రత్యేకంగా గని పరిసరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మైన్స్ కమిటీ సభ్యులు, గని మేనేజర్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. మాన్‌వేకు వెళ్లే మార్గంలో వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశమూ ఉందని గుర్తించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే డ్రైనేజీ, నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. అలాగే స్నానాల గదులు, కార్మికులు ఉపయోగించే సాధారణ ప్రదేశాల్లో ప్రతిరోజూ శుభ్రత నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత లోపిస్తే కార్మికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం



పడుతుందని, అలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి కార్మికుడికి అండగా నిలిచి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. గనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడి సంక్షేమం, భద్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో యాజమాన్యం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్యాంప్రసాద్, ఎస్ఓ అనిల్ సాగర్, ఎల్‌హెచ్‌డీ మరియు కామన్ సెక్షన్ ఇంచార్జి శ్రవణ్, యాక్టింగ్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్, మైన్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సందీప్, సుమన్, సురేందర్ రెడ్డి, దేవుసింగ్, కె. రాంచందర్, శశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళలకు 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ

## - చీరలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన "ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల పేద కుటుంబాల మహిళలకు "ఇందిరా మహిళా శక్తి" చీరలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటిని వినియోగించుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ చైర్మన్ రోహన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, మహిళా కౌన్సిలర్లు తోట సుజాల రాణి, విరివాడ అపర్ణ, దేవ జ్యోతి, కర్నాటి విజయలక్ష్మి, ఉప్పు నాగమణి, నసీమ షరీఫ్, మట్టా ప్రసాద్, జగ్గానాధం శ్రీను, దేవి స్వీట్ శ్రీను, మందపాటి ప్రభాకర్ రెడ్డి, శరత్ చంద్ర, హకీమ్, గ్రాండ్ మౌలాలి, దూదిపాల రాంబాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, చల్లగుళ్ల కృష్ణయ్య, కమల్ పాషా, మహిళలు, మున్సిపల్ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

## - వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి సూచనలు

## - పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 29: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఐడీఓసి కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతున్నారని తెలిపారు. అలాగే ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని చెప్పారు. ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని



అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ వ్యర్థాలను కాల్చొద్దు -- వాతావరణ కాలుష్యంతో ఓజోన్ పొర దెబ్బతింటుంది

## రైతులకు టేకులపల్లి మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ సూచనలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 29: పంట కోత అనంతరం వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం వల్ల తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడి ఓజోన్ పొర దెబ్బతింటుందని టేకులపల్లి మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం ద్వారా కార్బన్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్, క్లోరో ఫ్లోరో కార్బన్ వంటి విష వాయువులు వాతావరణంలోకి విడుదలవుతాయని తెలిపారు. కార్బన్ డయాక్సైడ్ సుమారు 120 సంవత్సరాలు, మీథేన్ వాయువు దాదాపు 20 సంవత్సరాల వరకు వాతావరణంలో ఉండి పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ విషవాయువులు ఓజోన్ పొరను నాశనం చేసి అల్ట్రావైలెట్ కిరణాల ప్రభావాన్ని పెంచుతున్నాయని, తద్వారా మనుషులు, జంతువులు, ప్రకృతి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. వ్యవసాయ అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూమి సారవంతత తగ్గిపోతుందని చెప్పారు. దీని ప్రభావంతో భూమిలో నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు సేంద్రియ కార్బన్ శాతం కూడా తగ్గుతుందని తెలిపారు. ఫలితంగా పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియబెడితే నత్రజని, భాస్వరం, పొటాష్, క్యాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ వంటి సూక్ష్మపోషకాలు భూమికి అందుతాయని చెప్పారు. దీంతో భూమి సారం పెరిగి లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందని వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, ప్రజలు కొత్తరకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ కాలుష్యం పెరగడం వల్ల గ్లోబల్ వార్మింగ్ ప్రభావం అధికమై సహజ వనరులు, వ్యవసాయం తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీ.ఓ నెం.27 అమల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఆ చట్టం ప్రకారం వ్యవసాయ వ్యర్థాలను కాల్చితే కనీసం రూ.5 వేల నుంచి గరిష్టంగా రూ.25 వేల వరకు జరిమానాతో పాటు కారాగార శిక్ష కూడా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ అంశాలపై రైతులు, గ్రామపంచాయతీ సర్పంచులు, సెక్రటరీలు, వ్యవసాయ అధికారులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణి, విశాల, దాసుతండ సర్పంచ్ చందర్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు సరైన ఏర్పాట్లు కల్పించని పాపన్నపేట తహసీల్దార్

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అవ్యవస్థ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 29: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. అయితే చిన్న సమావేశ మందిరంలో వంద మందికిపైగా లబ్ధిదారులను కూర్చోబెట్టడంతో తీవ్ర రద్దీ నెలకొంది. లబ్ధిదారులు ఒకరిపై ఒకరు పడే పరిస్థితి ఏర్పడగా, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు బయటే నిలబడాల్సి వచ్చింది. సరిపోని గదిలో కార్యక్రమం నిర్వహించడం వల్ల సమావేశం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని పలువురు విమర్శించారు.



కార్యక్రమం జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా పదేపదే నిలిచిపోవడంతో చీకట్లోనే కార్యక్రమాన్ని కొనసాగించాల్సి వచ్చింది. కరెంట్ అంతరాయంతో లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ బ్యాకప్ వంటి సౌకర్యాలు కూడా కల్పించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

# పేదలను కాదని సంపన్నులకు ఎన్నెస్పి భూములు అప్పగిస్తారా..?.

## – ఆక్రమణలు తొలగించకపోతే ఆందోళన చేస్తాం: సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్
## – ఎన్నెస్పి ఆక్రమిత ప్రాంతాలను పరిశీలించిన సీపీఐ బృందం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 29: నిలువ నీడ లేక ఎన్నెస్పి కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలను బలవంతంగా తొలగించిన అధికారులు, అదే భూములను సంపన్నులు ఆక్రమిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక న్యాయం, ధనికులకు మరో న్యాయం అమలు చేస్తున్నారా అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పి స్థలాల ఆక్రమిత ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించి పరిస్థితులను పరిశీలించింది. గతంలో పేదల గుడిసెలను తొలగించి అక్కడ గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రాంతాల్లో ప్రస్తుతం యథేచ్ఛగా ఆక్రమణలు, నిర్మాణాలు జరుగుతున్నాయని దండి సురేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, పదవీ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఆక్రమణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పేదల గుడిసెల తొలగింపుకు న్యాయస్థానాలను ఆశ్రయించిన రాజకీయ నాయకులే ఇప్పుడు అదే భూముల్లో షెడ్లు నిర్మించుకోవడం శోచనీయమన్నారు. ఎన్నెస్పి మేజర్–2 కాలువకు 66 అడుగుల వెడల్పు ఉందని అధికారులు ధృవీకరించినప్పటికీ, 12వ డివిజన్‌లో అష్టలక్ష్మి దేవాలయం సమీపం నుంచి గొల్లగూడెం రోడ్డువరకు ఆక్రమణలు విస్తరించాయని తెలిపారు. కొందరు ఇప్పటికే శాశ్వత నిర్మాణాలు పూర్తి చేయగా, మరికొందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించి కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. కొంతమంది రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఈ ఆక్రమణలు కొనసాగుతున్నాయని, స్థలాల ఆక్రమణ కోసమే కొందరు పార్టీలు మారుతున్నారని సురేష్ విమర్శించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు ఆ పనులు చేపట్టకపోవడమే కాకుండా ఆక్రమణలను కూడా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించాలని, లేకపోతే పేదలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ఆరోపిస్తూ, ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలన బృందంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సీపీఐ నాయకులు ఉపేందర్, నర్సింహారావు, సైదులు, మదూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

## సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ధర్నా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 29: కేంద్రంలోని ఎన్‌డీఏ–బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ తదితర నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ భద్రాద్రి జిల్లా కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ క్రిష్ణ డిమాండ్ చేశారు. అలాగే నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, పాత అంజనాపురం గ్రామంలో గ్రామకంఠం భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టా హక్కులు కల్పించాలని కోరారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జాటోత్ క్రిష్ణ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకులు, బస్సు, రైల్వే, విమాన ఛార్జీలు, ఆరోగ్యానికి సంబంధించిన మందులు, వ్యవసాయ ఎరువులు, పురుగుమందుల ధరలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారాలు మోపిందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్య ప్రజల జీవితాలను కష్టాల్లోకి నెట్టిందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం పనిచేస్తూ ప్రజలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజలు సమస్యలపై ఉద్యమిస్తుంటే మతోన్మాదం, అల్లర్ల ద్వారా అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని కూడా విమర్శించారు.




ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులైన పేదలకు అందడం లేదని ఆరోపించారు. రెండో దశలో పారదర్శకంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాత అంజనాపురం గ్రామంలో గత ఐదారు సంవత్సరాలుగా గ్రామకంఠం భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టా హక్కులు కల్పించి ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు గోపాలరావు, మండల కార్యదర్శి పెద్దబోయిన సతీష్, ఏఐయూకేఎస్ జిల్లా నాయకులు బైరు వెంకన్న, మండల నాయకులు కేశవ్, పాపక్క, టి.లక్ష్మి, సావిత్రి, జ్యోతి, కోరనాగమ్మ, వాసం వెంకటమ్మ, జాల కోటమ్మ, చీమల గురమ్మ, సావిత్రి యాకయ్య, కుంజ సుగుణ, కల్తీ నాగమణి, రేణిగుంట శంకర్, ఈసం రాములమ్మ, తాటి ప్రవీణ్, బుచ్చయ్య, సంజన, సామ్రాజ్యం, ముక్తి ఇంద్రజ, పూనం కృష్ణవేణి, కోరం నాగమ్మ, జబ్బ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబానికి 'కుటుంబ భరోసా' చెక్కు అందజేత

## ఖమ్మం టౌన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఔదార్యం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 29: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణపురం గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ మరికంటి నాగేశ్వరరావు కుటుంబానికి ఖమ్మం టౌన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'కుటుంబ భరోసా' చెక్కును అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 1,65,000 విలువైన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం 'కుటుంబ భరోసా' కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. సభ్యుల కుటుంబాలకు కష్టసమయంలో అండగా నిలవడం సంఘం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మరికంటి నాగేశ్వరరావు కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంత ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్, జిల్లా గౌరవ సలహాదారులు వేములూరు నాగరాజు, జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట, జిల్లా కోశాధికారి నీరుడు తిరుపతిరావు, ముదిగొండ మండల అధ్యక్షులు సామల కోటేశ్వరరావు, కోశాధికారి చందు, కార్యదర్శి అశోక్, ఖమ్మం టౌన్ అధ్యక్షులు మేఘన శీను, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి ఉపేందర్‌రావు, ఖమ్మం టౌన్ గౌరవ సలహాదారులు శేషగిరి, కుటుంబ భరోసా ఇంచార్జ్ చారి, రూరల్ మండలం కోశాధికారి గౌస్, రఘునాథపాలెం గౌరవ అధ్యక్షులు బాలాజీ, జిల్లా నాయకులు ఆర్కే బాబాయ్, చారి భద్రం తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో గిరిజన చట్టాలను అమలు చేయాలి

## జూన్ 2న సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట మహాధర్నాకు ఎల్‌హెచ్‌పీఎస్ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 29: సింగరేణి సంస్థలో గిరిజనులకు రాజ్యాంగ పరిరక్షణల మేరకు హక్కులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి కుశ నాయక్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 2న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచ మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1997 సమతా జడ్జిమెంట్, 1996 పీసా చట్టాల ప్రకారం సింగరేణిలో గిరిజనులకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్ గనులు ఏర్పడితే స్థానిక గిరిజన నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని ఆశించామని, కానీ కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల కార్మికులను నియమించుకోవడం వల్ల స్థానిక యువత నిరాశ చెందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్థానిక గిరిజనులతో కాంట్రాక్ట్ ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గనుల కాంట్రాక్టులు పొందిన సంస్థలు సమతా జడ్జిమెంట్ ప్రకారం గిరిజనులకు 100 శాతం ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాగే సింగరేణి గనుల్లో సెక్యూరిటీ సేవల కాంట్రాక్టులు పొందిన గిరిజనేతర ఏజెన్సీల లైసెన్సులు రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, 1/70 చట్టం, పీసా యాక్ట్ ప్రకారం చెల్లవని పేర్కొన్నారు. ఆ లైసెన్సులను రద్దు చేసి గిరిజనులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, ప్రజలు అనారోగ్య సమస్యలు



ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. దుమ్ము, ధూళి కాలుష్యంతో పాటు చెరువులు ఎండిపోవడం, వ్యవసాయ భూములు బీడుగా మారడం, రైతులు జీవనోపాధి కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే బాంబ్ బ్లాస్టింగ్ నిలిపివేసి యంత్రాలతో బొగ్గు తవ్వకాలు చేపట్టాలని, ఓపెన్‌కాస్ట్‌లకు బదులుగా భూగర్భ గనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత గనుల నుంచే సింగరేణి ఉత్పత్తిలో 43 శాతం బొగ్గు లభిస్తోందని, అందువల్ల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల్లో 43 శాతం గిరిజన గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి వెంకటేశ్వర్లు, భూక్య కృష్ణవేణి, బానోత్ లలిత, సుధాకర్, మహేష్, రామకృష్ణ, రాజేష్, ఉలవలపూడి రాములు తదితరులు పాల్గొన్నారు.



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

# సదాశివరావు మృతికి నివాళి

ఖమ్మం, మే 29: కాల్వ ఒడ్డులోని గుంటు మల్లేశ్వరస్వామి ఆలయ మాజీ డైరెక్టర్, మున్నూరు కాపు సంఘం సభ్యులు, సారథి నగర్ ప్రాంతానికి చెందిన సదాశివరావు గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల స్థానిక ప్రజలు, నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు తోట రామారావు సదాశివరావు నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా తోట రామారావు మాట్లాడుతూ సదాశివరావుతో తమకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయన చికిత్స అనంతరం కోలుకుని మళ్లీ సాధారణ కార్యకలాపాలు నిర్వహిస్తుండగా ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. తదనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో నాయకులు, స్థానికులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో 48వ డివిజన్ నివాసితులు వంగాల వెంకట్, చేతి కృష్ణ, కిషన్ నాయక్, బాబా, వేల్పుల శ్రీను, దొడ్డ వెంకటేశ్వర్లు, నరసయ్య, రాము, వెంకటేశ్వరరావు, విప్పా వేణుమోహన్, శాభాసు రమణ, తోకల ప్రభాకర్, సత్యం, నవీన్, ప్రతాపనేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

## రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు: మంత్రి శ్రీధర్ బాబు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 29: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎలాంటి ఆందోళనకు గురికావద్దని మంత్రి శ్రీధర్ బాబు రైతులకు భరోసా కల్పించారు. శుక్రవారం జయశంకర్–భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో పర్యటించిన మంత్రి అనంతరం కాటారం మార్కెట్ కార్యాలయాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తూ యాత్రలు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. మిల్లర్ల వద్ద ధాన్యం దిగుమతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. రైతులు తెచ్చిన ధాన్యం తడవకుండా మిల్లర్ల వద్దకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. మంత్రి వెంట మార్కెట్ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడమే మోదీ ప్రభుత్వ ధ్యేయం

## – సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత గౌని నాగేశ్వరరావు ఆరోపణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 29: దేశ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పగించడమే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు ఆరోపించారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండల మహాసభ శుక్రవారం రెడ్డిగూడెంలో కళింగ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని లక్ష్యంగా చేసుకుని రైతులను నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో రైతులు ఏ పంట వేయాలి, ఎంత పండించాలి అన్న విషయాల్లో కూడా కార్పొరేట్ కంపెనీలు, విదేశీ శక్తుల ప్రభావం పెరుగుతోందని ఆరోపించారు. పత్తి వంటి పంటల విషయంలో కూడా రైతుల స్వేచ్ఛను హరించే విధంగా విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రైతులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంటలు వర్షాలకు తడిసి మార్కెట్లలో నిల్వ ఉండిపోతున్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల లేమి, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు దళారీలకు తక్కువ ధరలకు పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముందు కందాల బుచ్చిరెడ్డి జెండా ఆవిష్కరణ చేయగా, అమరవీరుల సంతాప తీర్మానాన్ని కార్యదర్శి నివేదికతో కలిసి కామ్రేడ్ ఉప్పరబోయిన రామ్మూర్తి ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఉప్పరబోయిన రామ్మూర్తి, కళింగ రెడ్డి, బుచ్చిరెడ్డి, బత్తుల నాగరాజు, కొమరం మల్లేష్, తూము రాజయ్య, ముత్తమ్మ మణెమ్మ, అంజలి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 29: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వడ్ల కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వడ్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు భూపాలపల్లి జిల్లా గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజువారీగా ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు.

# ఆరోగ్యం

## మీ శరీరంలో ఈ మార్పులు కనబడితే క్యాన్సర్ వచ్చినట్లే..

### 9 శాతం మందికి తెలియనది ఇదే

ప్రతి ఏటా ఫిబ్రవరి 4న వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించబడుతుంది. ప్రజల్లో క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడం, ఈ ప్రాణాంతక వ్యాధితో పోరాడటానికి ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలను బలపేతం చేయడం దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం. చెడు ఆహారపు అలవాట్లు చెడు జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య భారీగా పెరుగుతుంది. ఈ ప్రాణాంతక వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించగలిగితే విజయవంతంగా జయించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు కోల్పోక తప్పదు. అయితే ప్రారంభ దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తుపట్టడం అంత ఈజీ కాదు. ఎందుకంటే 99 శాతంమందికి అవి క్యాన్సర్ లక్షణాలు అని తెలియదు.

క్యాన్సర్ వస్తే కనిపించే లక్షణాలు ఇవే బరువు తగ్గిపోవడం అమెరికన్ క్యాన్సర్ సొసైటీ తెలిపిన వివరాల ప్రకారం..క్యాన్సర్ సోకినవారిలో చాలామంది వేగంగా బరువు తగ్గిపోతుంటారు. పాంక్రియాస్, కడుపు, ఊపిరితిత్తులు, అన్న వాహిక క్యాన్సర్ లు వచ్చినప్పుడు ఇలా జరుగుతుంటది. తరచూ జ్వరం క్యాన్సర్ రోగుల్లో జ్వరం అనేది సాధారణ లక్షణం. క్యానర్స్ పుట్టిన దగ్గర నుంచి ఇతర అవయువాలకు వ్యాప్తి చెందేటప్పుడు జ్వరం వస్తుంది.

అలసట క్యాన్సర్ లక్షణాల్లో అలసట కూడా ఒకటి. విశ్రాంతి తీసుకున్నా కూడా రోగులు అలసట నుంచి బయటపడలేరు. లుకేమియా వంటి కొన్ని క్యాన్సర్ లలో అలసటే తొలి లక్షణం. పెద్ద పేగు లేదా కడుపు క్యాన్సర్లు రక్తహీనతకు కారణమవుతాయి. చర్మ మార్పులు చర్మంపై కొత్త మచ్చలు, పుట్టుమచ్చలలో మార్పులు లేదా చర్మం రంగు మారడం వంటివి క్యాన్సర్ యొక్క లక్షణాలు కావచ్చు. గాయాలు మానకపోవడం శరీరంపై ఏర్పడిన గాయాలు చాలా కాలం




పాటు మానకపోతే అది క్యాన్సర్ సంకేతంగా పరిగణించబడుతుంది. గొంతు బొంగురుపోవడం గొంతు బొంగురుపోవడం లేదా మింగడంలో ఇబ్బంది క్యాన్సర్ యొక్క లక్షణం కావచ్చు. ముఖ్యంగా ఇది చాలా కాలం పాటు కొనసాగితే డాక్టర్ ని సంప్రదించడం అవసరం. దగ్గు నిరంతర దగ్గు, దగ్గులో రక్తం లేదా శ్లేష్మం రావడం ఊపిరితిత్తుల క్యాన్సర్ లక్షణాలు కావచ్చు. మలబద్ధకం లేదా విరేచనాలు మలబద్ధకం లేదా విరేచనాలలో మార్పులు, మలంలో రక్తం రావడం పెద్ద ప్రేగు క్యాన్సర్ యొక్క లక్షణాలు కావచ్చు. మూత్రంలో మార్పులు.

మూత్రవిసర్జనలో నొప్పి, మూత్రంలో రక్తం లేదా తరచుగా మూత్రవిసర్జన చేయడం వంటివి మూత్రపిండాల లేదా మూత్రాశయ క్యాన్సర్ యొక్క లక్షణాలు కావచ్చు. రొమ్ము మార్పులు రొమ్ములో గడ్డలు, రొమ్ము చర్మంపై మార్పులు లేదా రొమ్ము నుండి ద్రవం రావడం రొమ్ము క్యాన్సర్ లక్షణాలు కావచ్చు. నాలుకపై తెల్లని మచ్చలు నాలుకపై తెల్లని మచ్చలు కనిపించినా దాన్ని క్యాన్సర్‌కు ముందు కనిపించే లక్షణంగా అనుమానించవచ్చు. కాబట్టి నాలుకపై తెల్ల మచ్చలు కనిపిస్తే వెంటనే డాక్టర్ ని సంప్రదించాలి. ఇది కూడా స్టేజ్ జీరోలో కనిపించే సాధారణ లక్షణం. అయితే ఈ తెల్ల మచ్చలకు నోటి ఆరోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చు.

## ఇడ్లీ,దోస కన్నా 100 రెట్లు బలం..

ఇప్పుడంటే మనం పొద్దున్నే లేవగానే బ్రేక్ ఫాస్ట్ లోకి ఇడ్లీ,దసె లేదా వడలు వంటివి తింటున్నాం కానీ మన పూర్వీకులు పొద్దున్నే లేవగానే చద్దన్నమే తినేవాళ్లు. దీనినే చల్ది అని కూడా అంటారు. ఇడ్లీ,దోశల కన్నా 100 రెట్లు బెటర్ ఇది. ఈ మధ్య కాలంలో చాలామంది సెలబ్రిటీలు కూడా చద్దన్నం ప్రాముఖ్యత గురించి చెబుతూ సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నారు. డయాబెటిస్, బీపీ, ఎసిడిటీ సమస్యతో బాధపడేవారికి ఈ చద్దన్నం చాలా మేలు చేస్తుంది. అమెరికా సహా అనేక దేశాల్లో ఈ చద్దన్నం ఎక్కువ రేటుకి అమ్ముతుంటారు. మనం మాత్రం ఎలాంటి ఖర్చు లేకుండా ఇంట్లోనే ఈజీగా చేసుకోవచ్చు. వేసవిలో తప్పక తినాల్సిన..మనం మర్చిపోయిన ప్రాచీన విధానంలో చల్ది అన్నం ఎలా రెడీ చేసుకోవాలో ఇక్కడ చూడండి.

చల్ది అన్నం తయారీకి కావాల్సిన పదార్థాలు –మెత్తగా ఉడికించిన తెల్ల అన్నం లేదా మిల్లెట్స్ –మజ్జిగ –గోరు వెచ్చని పాలు –ఉల్లిపాయ –పచ్చిమిర్చి –వేడి నీళ్లు –ఉప్పు చల్ది అన్నం తయారీ విధానం – ముందుగా వైట్ రైస్ లేదా మిల్లెట్స్ మెత్తగా ఉడికించాలి. –తర్వాత ఓ మట్టి పాత్రలో మెత్తగా ఉడికించిన అన్నం లేదా మిల్లెట్స్ 1.5 కప్పు వేసి ఇందులో 1 కప్పు వేడినీళ్లు, 1 కప్పు గోరు వెచ్చని పాలు పోయండి. –2–3 నిమిషాల తర్వాత అందులో 3 టేబుల్ స్పూన్ల



మజ్జిగ, నాలుగు పెద్ద ముక్కల ఉల్లిపాయలు, రెండు పచ్చిమిర్చి వేసి రాత్రంతా మూతపెట్టి ఉంచండి. –తెల్లవారిన తర్వాత మూత తీసి అందులో రుచికి సరిపడా ఉప్పు వేసి కలపండి. అంతే చల్ది అన్నం లేదా చద్దన్నం రెడీ.

తెలుగు వంటలు

## గుంటూరు స్టైల్ స్పైసీ చికెన్ రోస్ట్..ఎలా చేసుకోవాలో చూడండి



స్పైసీ వంటకాలకు గుంటూరు పెట్టింది పేరు. ఏపీలోని గుంటూరు పేరు వింటేనే చాలామందికి అక్కడి స్పైసీ వంటకాలు గుర్తుకొచ్చి నోట్లో లాలాజలం ఊరిపోతుంది. గుంటూరు స్పెషల్ చికెన్ రోస్ట్ తినాలంటే పెట్టి పుట్టాల్సిందేనని అక్కడి వాళ్లు చెబుతుంటారు. కారం,మసాలాల కలయికతో చాలారుచికరంగా ఉంటుంది. గుంటూరు చికెన్ రోస్ట్ ప్రత్యేకత దాని కారంలో ఉంటుంది. ఈ వంటకంలో గుంటూరు ప్రాంతానికి చెందిన ప్రత్యేకమైన కారం పొడిని ఉపయోగిస్తుంటారు. ఈమిర్చి చాలా కారంగా ఉండి వంటకానికి ప్రత్యేకమైన రుచిని ఇస్తుంది. గుంటూరు స్టైల్ చికెన్ రోస్ట్‌ని ఇంట్లోనే తయారు చేసుకోడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

గుంటూరు చికెన్ రోస్ట్ తయారీకి కావలసిన పదార్థాలు –చికెన్– 1 కేజీ –ఉల్లిపాయలు– 2 –పచ్చిమిర్చి– 4 –అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టేబుల్ స్పూన్లు –టొమాటోలు – 2 –కారం పొడి– 2 టేబుల్ స్పూన్లు –ధనియాల పొడి– 1 టేబుల్ స్పూన్ –జీలకర్ర పొడి– 1 టీస్పూన్ –గరం మసాలా– 1/2 టీస్పూన్ –పసుపు– 1/2 టీస్పూన్ –ఉప్పు –నూనె –కొత్తిమీర గుంటూరు చికెన్ రోస్ట్ తయారీ విధానం – చికెన్‌ను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. –ఒక గిన్నెలో చిర్నగా కట్ చేసిన చికెన్ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కనీసం 30 నిమిషాల పాటు నానబెట్టాలి. –ఒక పాన్ లో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. –పచ్చిమిర్చి చీలికలు వేసి కాసేపు వేయించాలి. –నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి బాగా కలపాలి. –టొమాటో ముక్కలు వేసి మెత్తగా అయ్యే వరకు ఉడికించిన తర్వాత అందులో గరం మసాలా వేసి కలపాలి. ఈ వంటకంలో మీరు కొంచెం పెరుగు కూడా వేయవచ్చు. –చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడి వేడిగా సర్వ్ చేసుకోవడమే.

## స్ట్రీట్ ఫుడ్ లవర్స్ రెండు నిమిషాల్లో ముంత మసాలా ఇలా చేసుకోండి.. చాలా సింపుల్ గురూ!



స్ట్రీట్ ఫుడ్ అంటే అందరికీ ఇష్టం ఉంటుంది. రోడ్డు మీద వెళ్తూ వెళ్తూనే పక్కన ఆపేసి స్ట్రీట్ ఫుడ్ తినేస్తుంటారు. అందరికీ ఇష్టమైనది, క్షణాల్లోనే సిద్ధమయ్యేది ముంత మసాలా. పలు రకాల కూరగాయలు, మసాలాలు వేసుకొని దీనిని తయారు చేస్తారు. మన కళ్ళ ముందే రెండు నిమిషాల్లో చేసి ఇచ్చే ఈ ముంత మసాలా రుచి మాత్రం సూపర్ ఉంటుంది. ఈ ముంత మసాలా ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో క్లియర్ కట్‌గా తెలుసుకుందాం. ముంత మసాలా తయారీకి కావాల్సిన పదార్థాలు మురుమురాలు కార్న్ ఫ్లేక్స్ నూనె అరకప్పు పల్లీలు ఒక ఉల్లిపాయ ఒక టమాటో రెండు పచ్చిమిర్చి ఒక టీస్పూన్ ధనియాల పొడి పావు టీస్పూన్ జీలకర్ర పొడి అర టీస్పూన్ కారం చాట్ మసాలా రెండు టేబుల్ స్పూన్ ఆలూ భుజియా కొత్తిమీర నిమ్మకాయ ముంత మసాలా తయారీ విధానం ముందుగా స్టవ్ ఆన్ చేసి ఒక బాణీ పెట్టుకోవాలి. అందులో మనం తీసుకున్న మురుమురాలను మీడియం మంట మీద వేయించుకోవాలి. ఇలా వేయించుకోవడం వలన మురుములు క్రిస్పీగా తయారవుతాయి. ఆ తరువాత వాటిని ఒక గిన్నెలో తీసుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే బాణీలో కొంచెం నూనె పోసుకొని కార్న్ ఫ్లేక్స్ వేయించుకొని పక్కన తీసుకోవాలి. ఇప్పుడు అదే నూనెలో అరకప్పు పల్లీలలను కూడా వేయించుకొని పక్కన తీసుకోవాలి. ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకొని అందులో మనం ముందుగా వేయించి పెట్టుకున్న మురుమురాలను వేసుకోవాలి. అందులోనే ముందుగానే వేయించి పెట్టుకున్న కార్న్ ఫ్లేక్స్ కూడా వేసుకోవాలి. అనంతరం ఆ కార్న్ ఫ్లేక్స్‌ను మెల్లగా చేతితో ప్రెస్ చేస్తూ ఛిద్రం చేసుకోవాలి. ఇప్పుడు అందులో సన్నగా తడుముకున్న ఉల్లిపాయను వేసుకోవాలి. అలాగే సన్నగా తురిమిన టమాటోను కూడా వేసుకోవాలి. ఇప్పుడు అందులోనే రెండు పచ్చి మిర్చిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని అందులో వేసుకోవాలి. ఇప్పుడు అందులో రుచికి సరిపడా ఉప్పు కూడా వేసుకోవాలి. ఇప్పుడు అందులోనే పావు టీస్పూన్ జీలకర్ర పొడి, ఒక టీస్పూన్ ధనియాల పొడి, ఒక టీస్పూన్ కారం పొడి, ఒక టీస్పూన్ చాట్ మసాలా కూడా వేసుకోవాలి. ఇప్పుడు అందులో రెండు టేబుల్ స్పూన్ల ఆలు భుజియా, సన్నగా తరిగిన కొత్తిమీర కూడా వేసుకోవాలి. ఇప్పుడు అందులో ఒక చిన్న నిమ్మకాయ కూడా పిండుకోవాలి. దానిపై ముందుగా ఫ్రై చేసి పెట్టుకున్న పల్లీలు కూడా వేసుకొని, అన్నిటినీ బాగా కలుపుకోవాలి. మురుమురాలకు మసాలాలు అన్నీ కలిసే విధంగా కలుపుకుంటే ముంత మసాలా సిద్ధమైనట్లే.


## శరీరానికి బలం ఇచ్చే ప్రోటీన్ దోశ ఎలా చేస్తారో తెలుసా? సింపుల్‌లో ఇలా చేసుకోండి!

మీ ఇంట్లో దోశ ప్రియులు చాలా మంది ఉన్నారా? రోజుకి ఒక్కసారైనా ఇంట్లోనే దోశ చేసుకుంటారా? అయితే ఎప్పుడూ ఒకే రకమైన దోశ తిని బోర్ కొడుతుందా? కొంచెం పోషక విలువలు కలిగిన దోశను ఇంట్లోనే తయారు చేసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఒకసారి ఈ ప్రొటీన్ దోశ చేసుకోండి. దీనిని శెనగపప్పుతో తయారు చేస్తారు. శెనగపప్పులో ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది కాబట్టి దానిని ప్రోటీన్ దోశ అని పిలుస్తుంటారు. ఈ దోశ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాగే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. ఈ ప్రోటీన్ దోశ ఎలా తయారు చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

రెసిపీ: లి ముందుగా పప్పును కడిగి కనీసం 8 గంటల పాటు నానబెట్టాలి. లి 8 గంటల తర్వాత పప్పును మిక్సీ జార్‌లో వేసి కరివేపాకు, జీలకర్ర, అల్లం, రుచికి సరిపడా ఉప్పు వేసి కొద్దిగా నీళు ్ల పోసి బాగా రుబ్బుకోవాలి. తర్వాత మైదా పిండిని ఒక గిన్నెలో పోయాలి. అందులో దోశ పిండి వేసుకోవాలి. పిండి మరీ చిక్కగా ఉంటే పిండిలో కొంచెం నీళ్లు పోసి



కలుపుకోవాలి. ఇప్పుడు అందులో సన్నగా తరిగిన కొత్తిమీర, ఇంగువ పొడి వేసి బాగా కలపాలి. చివరగా దోశ పెనంను స్టవ్ మీద పెట్టి.. పెనం వేడయ్యాక పెనంపై నూనె పోసి.. దోశలు వేసుకుంటే ఎంతో రుచికరమైన ప్రోటీన్ దోశ సిద్ధమైనట్లే. ఇది తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.






# సుహాసిని ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదేనా? 63ఏళ్ల వయసులోనూ ఫుల్ ఎనర్జీ!



వయసు పెరిగేకొద్దీ చాలామంది తమ శారీరక చురుకుదనాన్ని తగ్గించుకుంటారు. కానీ కొందరు మాత్రం వయసును నెంబర్ గానే తీసుకుని కొత్త విషయాలను నేర్చుకుంటూ జీవితాన్ని ఆస్వాదిస్తుంటారు. అలాంటి వారిలో ప్రముఖ నటి సుహాసిని మణిరత్నం ఒకరు. 63 ఏళ్ల వయసులో కూడా ఆమె జుంబా, సాల్సా వంటి డాన్స్ ఫార్మ్స్‌తో పాటు 63 ఏళ్ల వయసులో భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. రీసెంట్ గా రైటర్ సుధా మీనన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సుహాసిని తన ఫిట్‌నెస్ జర్నీ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"నేను జుంబా చేస్తాను. సాల్సా చేస్తాను. 63 ఏళ్ల వయసులో భరతనాట్యం నేర్చుకోవడం మొదలుపెట్టాను. నా టీచర్ మీరు అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కానీ నేను ప్రేక్షకుల కోసం కాదు, నా కోసం నేనే నాట్యం చేస్తున్నానని" చెప్పానంటూ సుహాసిని చెప్పిన మాటలు ఎంతో మందిని ప్రేరేపిస్తున్నాయి. వయసు పెరిగినా కొత్తగా నేర్చుకోవాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆమె మరోసారి నిరూపించారు. ముఖ్యంగా భరతనాట్యం వంటి కఠినమైన శాస్త్రీయ నృత్యాన్ని ఈ వయసులో ప్రారంభించడం ఎంతో మందికి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఆరోగ్య నిపుణులు కూడా సుహాసిని నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు. వయసు ఒక్కటే పరిమితి కాదు. వ్యక్తిగత ఫిట్‌నెస్, మెడికల్ హిస్టరీ ముఖ్యమైనవి. భరతనాట్యం వంటి నృత్యాలకు శరీర బలం, సమతుల్యత, ఫ్లెక్సిబిలిటీ అవసరమని, సరైన మార్గదర్శకత్వంలో క్రమంగా నేర్చుకుంటే ఇవి కండరాల బలం పెంచడంతో పాటూ మొబిలిటీ మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. అయితే ఒక్కసారిగా ఎక్కువగా ప్రాక్టీస్ చేయడం వల్ల మోకాళ్లు, కాళ్ల మడమలు, నడుముపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా భరతనాట్యంలో ఉండే డీప్ నీ బెండ్స్, స్టాంపింగ్ మూమెంట్స్, ఫుట్‌వర్క్ కారణంగా మోకాళ్ల సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని కూడా వారు సూచిస్తున్నారు. అయితే సరైన టెక్నిక్, క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టితే డ్యాన్స్ వయసుతో సంబంధం లేకుండా జీవితానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. డాన్స్ కేవలం వినోదం మాత్రమే కాదు, అది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాగా సుహాసిని చెప్పిన తాను ఆడియన్స్ కోసం కాదు, తన కోసమే డాన్స్ చేస్తున్నాననే మాటలు జీవితాన్ని ఆస్వాదించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప సందేశంగా మారాయి.

# విజువల్స్‌కే కాదు.. కథలకూ రెడీ అయిన రత్నవేలు!




సినిమాటోగ్రఫీ అంటే కేవలం అందమైన ఫ్రేములు కాదు, కథకు ప్రాణం పోసే విజువల్ భాష. ఆ భాషను అత్యంత బలంగా మాట్లాడగలిగిన టెక్నీషియన్లలో ఆర్. రత్నవేలు పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రతి సినిమాకు కొత్త టెక్స్చర్, కొత్త మూడ్, కొత్త విజువల్ ఐడెంటిటీ ఇవ్వడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం దక్షిణాది సినీ పరిశ్రమలోనే కాదు, ఇండియన్ సినిమాలో కూడా ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడు అలాంటి స్టార్ సినిమాటోగ్రాఫర్ త్వరలోనే డైరెక్టర్ గా మారి మెగా ఫోన్ పట్టబోతున్నారనే వార్త ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మూడు కథలను సిద్ధం చేసుకున్న రత్నవేలు, వాటిలో ఒక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌ను తన డెబ్యూ ప్రాజెక్ట్‌గా తెరకెక్కించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. కెమెరా వెనుక ఎన్నో ప్రపంచాలను సృష్టించిన వ్యక్తి, ఇప్పుడు కథ చెప్పే బాధ్యతను కూడా స్వయంగా తీసుకోవాలని నిర్ణయించుకోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆయన విజువల్ సెన్స్‌ను చూసిన ప్రేక్షకులు, డైరెక్టర్ గా రత్నవేలు ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రోబో, రంగస్థలం, సైరా, 1 నేనొక్కడినే, సరిలేరు నీకెవ్వరు, దేవర వంటి సినిమాల్లో ఆయన చూపించిన ఫ్రేమింగ్, లైటింగ్, కలర్ టోన్స్ ఆ సినిమాలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. ముఖ్యంగా రంగస్థలంలో ఆయన సృష్టించిన గ్రామీణ వాతావరణం ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఒక కాలాన్ని తెరపై జీవంతో చూపించగల సామర్థ్యం రత్నవేలులో ఉందని అప్పుడే స్పష్టమైంది. అందుకే ఇప్పుడు ఆయన దర్శకత్వం వైపు అడుగులు వేయడం కేవలం మరో టెక్నీషియన్ మార్పుగా కాకుండా, ఒక విజువల్ స్టోరీటెల్లర్ కొత్త ప్రయాణంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన పెద్ది సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సినిమా గురించి మాట్లాడుతూ రత్నవేలు చెప్పిన విషయాలు కూడా ఆయన క్రియేటివ్ ఆలోచనలకు అద్దం పడుతున్నాయి. 40 ఏళ్ల క్రితం విజయనగరం ప్రాంత వాతావరణాన్ని గుర్తు చేసేలా ప్రత్యేక కలర్ ప్యాలెట్ రూపొందించడం, కొన్ని కీలక సన్నివేశాలను ఫిల్మ్ నెగెటివ్‌పై షూట్ చేయడం వంటి ప్రయోగాలు ఆయన సినిమాపై పెట్టే శ్రద్ధను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో తెరకెక్కించిన క్రికెట్ మ్యాచ్ సీన్స్ ఆడియన్స్ కు కొత్త అనుభూతిని ఇస్తాయని ఆయన చెబుతున్నారు.

# పాలరాతి శిల్పంలా మెరిసిపోతున్న జాన్వీ కపూర్!




దివంగత నటీమణి.. అందాలతార అతిలోకసుందరి శ్రీదేవి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో నటనతో యావత్ దేశ ప్రజలను తన అభిమానులుగా మార్చుకుంది.. అలాంటి ఈమె మన మధ్య లేకపోయినా ఆమె లేని లోటును ఆమె కూతురు జాన్వీ కపూర్ భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. అలా నటనతోనే కాదు అందాలతో ఆకట్టుకుంటూ తల్లిని తలపిస్తూ అభిమానులకు మంచి ఎంటర్టైన్మెంట్ ఇస్తోంది ఈ ముద్దుగుమ్మ. బాలీవుడ్లో పలు సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించిన జాన్వీ కపూర్ తెలుగులో కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర చిత్రం ద్వారా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించి.. తెలుగు అభిమానుల హృదయాలను దోచుకుంది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించిన జాన్వి కపూర్.. ప్రస్తుతం బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్గా అవకాశం దక్కించుకుంది.ఇందులో అచ్చియమ్మ అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటిస్తోంది జాన్వీ కపూర్. జూన్ 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో వరుస ప్రమోషనల్ కార్యక్రమాలను చేపట్టారు చిత్ర బృందం. అందులో భాగంగానే ఎవరికి వారు సినిమా విశేషాలను పంచుకుంటూ ఆకట్టుకుంటున్నారు. ఒకవైపు అప్పలసూరి పాత్రతో మరోసారి తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధమైన జగపతిబాబు వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తుంటే.. ఇటు అందాల తార జాన్వీ కపూర్ మాత్రం సోషల్ మీడియా వేదికగా లేటెస్ట్ ట్రెండీ ఔట్ఫిట్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను ఇటు ప్రమోషన్స్ తో సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అలా తాజాగా మరో ట్రెండీ ఔట్ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది జాన్వీ కపూర్.. తాజాగా అనామికా ఖన్నా డిజైన్ చేసిన తెలుపు రంగు ఐవరీ చీరను ధరించింది. తెల్లని పలుచని వస్త్రంపై చక్కటి హెవీ ఎంబ్రాయిడరీ డిజైన్ చేశారు. స్కాల్డప్ లేస్ డీటెయిల్ తో ఈ చీరను పూర్తి చేశారు. దీనికి కాంబినేషన్లో అంతే హెవీగా డిజైన్ చేసిన స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి ఆకట్టుకుంది. ఇక జుట్టును వేవ్ చేసిన ఈమె.. వైట్ గోల్డెన్ మిక్స్ చెవి దిద్దులను ధరించింది. నెక్ ను సింపుల్గా, బోసిగా ఉంచేసిన ఈమె.. ఈ లుక్కులో చూస్తుంటే పాలరాతి శిల్పం లా చెక్కబడిందేమో అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఈ వైట్ చీరలో తన బుగ్గలు బ్లష్ అవుతుంటే.. తన అందమైన మోముతో అభిమానులను ఆకట్టుకుంది జాన్వీ కపూర్. ఒక జాన్వీ కపూర్ లేటెస్ట్ ఔట్ ఫిట్ చూసిన అభిమానులు ఏంజెల్, బ్యూటిఫుల్ అంటూ ఇలా ఎవరికి వారు తమకు అనిపించిన రీతిలో తమ హావ భావాలను కామెంట్ రూపంలో వ్యక్తపరుస్తున్నారు. జాన్వీ కపూర్ విషయానికొస్తే.. ప్రస్తుతం తెలుగు , హిందీలో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. అందులో బాగానే తెలుగులో నటిస్తున్న పెద్ది సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# నార్త్ అమెరికాలో 'పెద్ది'.. స్పీడ్ మామూలుగా లేదు...



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న భారీ చిత్రం పెద్ది విడుదలకు ముందే ఓవర్సీస్ లో ఓ రేంజ్ లో హైప్ ను సొంతం చేసుకుంటోంది. ముఖ్యంగా నార్త్ అమెరికా మార్కెట్ లో ఆ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ లో దూసుకుపోతుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఆ చిత్రం, ప్రీమియర్ షోల ద్వారానే భారీ వసూళ్ల దిశగా అడుగులు వేస్తోంది.మేకర్స్ అందించిన సమాచారం ప్రకారం, పెద్ది నార్త్ అమెరికా ప్రీమియర్ ప్రీ సేల్స్ రూపంలో ఇప్పటికే 5 లక్షల 75 వేల డాలర్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఇంకా విడుదలకు కొన్ని రోజులు ఉండగానే ఆ రేంజ్ లో బుకింగ్స్ జరగడం విశేషం. ఇప్పటి వరకు 22,500కు పైగా టికెట్లు అమ్ముడయ్యాయని మేకర్స్ తాజాగా అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. మాస్సా మాస్సా మాస్సా అంటూ పోస్ట్ చేసి.. స్పెషల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు.అయితే నార్త్ అమెరికాలో తెలుగు సినిమాలకు ఎప్పటి నుంచో మంచి మార్కెట్ ఉంది. అయితే స్టార్ హీరోల సినిమాలకు మొదటి రోజు భారీ ఓపెనింగ్స్ రావడం ఇప్పుడు సాధారణంగా మారింది. కానీ పెద్ది విషయంలో కనిపిస్తున్న రెస్పాన్స్ మాత్రం వేరే స్థాయిలో ఉందని సినీ ప్రియులు చెబుతున్నారు. ముఖ్యంగా చరణ్ కు గత చిత్రాల తర్వాత వచ్చిన క్రేజ్.. పెద్ది సినిమాకు బాగా యూజ్ అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలు పెంచింది. ఇటీవల రిలీజ్ చేసిన హల్లాల్లో సాంగ్ కు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో మాస్ ఎమోషన్స్ తో కూడిన కథతో సినిమా తెరకెక్కుతున్నట్టు తెలుస్తుండగా.. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ స్పెషల్ సాంగ్ తో సందడి చేయనున్నారు.ఇక చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తుండగా.. జగపతిబాబు, దివ్యేందు శర్మ, విజి చంద్రశేఖర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. రిచ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో తెరకెక్కుతున్న ఆ సినిమాను వృద్ధి సినిమాస్, ఐవీవై ఎంటర్టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సంగీత బాధ్యతలు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిర్వహిస్తుండటం కూడా సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా మారింది. సినిమాటోగ్రఫీ రత్నవేలు అందిస్తుండగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. సాంగ్స్ ను జానీ మాస్టర్ కంపోజ్ చేశారు. అలాగే మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి. ఏదేమైనా ఓవర్సీస్ లో ఇదే స్పీడ్ కొనసాగితే విడుదలకు ముందే పెద్ది నార్త్ అమెరికాలో మిలియన్ డాలర్ మార్క్ ను అందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరేం జరుగుతుందో.. బాక్సాఫీస్ వద్ద ఎంతటి వసూళ్లు సాధిస్తుందో అంతా వేచి చూడాలి.



## నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

### - హవేలిఘనపూర్‌లో సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ సత్యనారాయణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 29: నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, కాలం చెల్లిన ఉత్పత్తులను విక్రయిస్తూ రైతులను మోసం చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హవేలిఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మెదక్ జిల్లా హవేలిఘనపూర్ మండల కేంద్రంలోని సీడ్స్ ౘ ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎంఆర్ఓ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ అమలులో తెలంగాణ అగ్రస్థానం

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. జాతీయ ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ వాటా 36 శాతంగా నమోదయిందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2021-2026 మధ్య దేశంలో 2.73 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు అయిందని తెలిపారు. అందులో 98,112 హెక్టార్లతో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ రైతుల కృషితోనే ఈ అగ్రస్థానం సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని చెప్పారు. 79,448 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. రైతులకు ఎకరాకు రూ.2 నుంచి 3 లక్షల వార్షిక ఆదాయం అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుందన్నారు. ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు రూ.23,501/ మెట్రిక్ టన్ను గిట్టుబాటు ధరగా ఉందని తెలిపారు.ఎగుమతి సుంకం పెంపుతో ధర రూ.25,000 వరకు పెరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే 3 ప్రాసెసింగ్ మిల్లులు, మరో 7 నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. 2026-27లో అదనంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని లక్ష్యంగా నిర్దేశిరచుకున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధి ప్లస్ గ్రామీణ ఉపాధి పెంపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

మొదటిపేజీ తరువాయి

ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉ ందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

మొదటిపేజీ తరువాయి

అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ఃతిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

## తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

మొదటిపేజీ తరువాయి

ఇంటి ముందు అడ్డుగా నేను నిలబడతాను అంటూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు . పవన్ కళ్యాణ్‌ను ఒక ప్యాకేజ్ స్టార్ గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. 'మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా, మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?' అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికాడు.

# బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి

### జిల్లా సంక్షేమ అధికారి ఈ.పి. ప్రేమలత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (ఏటూరునాగారం), మే 29 : బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని ములుగు జిల్లా సంక్షేమ అధికారి ఈ.పి.ప్రేమలత అన్నారు. బుధవారం ఐటిడిఏ ఏటూరు నాగారం సమావేశ మందిరంలో వివాహాల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో వివిధ మండలాలకు చెందిన పురోహితులు, ఖ్వాజీలు,పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీ లు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు తదితరులతో పాల్గొన్నారు.ఈ అవగాహన సదస్సుకు ఐటీడీఏ అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు అని,బాల్య వివాహాలను అరికడితేనే బాల బాలికల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలని, తద్వారా అందరూ కలిసి సమిష్టిగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఐ టి డి ఎ అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు అన్నారు. బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలిసే అవకాశం పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు మొదలగువారికి ఎక్కువగా ఉంటుందని, వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి.ప్రేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరమైన దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ఒక్క వర్గానికే పరిమితం కావని, అన్ని వర్గాల్లోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో వయస్సు నిర్ధారణ అత్యంత కీలకమని, వివాహాల నిర్వహణకు ముందు వయస్సు నిర్ధారణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ సిడిపిఓ కే.ముత్తమ్మ,సర్పంచ్ లు,కార్యదర్శులు,అంగన్వాడీ టీచర్లు,ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు,కృష్ణవేణి, హరికృష్ణ,సంజీవ,సుమన్, జ్యోతి,రాజు,నరేష్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ళలో కాంగ్రెస్ సర్కార్ విఫలం

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా? అని రేవంత్ సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హమాలీల ఖర్చు రైతులే చెల్లిస్తున్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపొమ్మని గత సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సందేహం వ్యక్తం చేశారు. గద్దెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఓటు బ్యాంకు కోసమే రైతులను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా.. యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసు మీరి, బుద్ధి మందగించిందని.. అందుకే బీజేపీని విమర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవుల కోసం, సూట్ కేసులు మోయడానికి కాంగ్రెస్ నేతలు ఢిల్లీ యాత్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల చర్చకు వస్తారా? అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. బీజేపీ యాత్ర చేస్తే కాంగ్రెస్ ఎందుకు భయపడుతుందంటూ సందేహం వ్యక్తం చేశారు. వాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజల్‌పై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజల్‌పై 30 శాతం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతు వడదెబ్బతో చనిపోతే మంత్రులు వెళ్లి పరామర్శించారా?.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారా? అని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. సన్ ఫ్లవర్, శనగలు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల చెబుతున్నారని.. అందుకు సంబంధించిన కౌంటర్ ఎక్కడ పెట్టారో చూపించాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

## తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

మొదటిపేజీ తరువాయి

టున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్దంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

మొదటిపేజీ తరువాయి

యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

మొదటిపేజీ తరువాయి

పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

మొదటిపేజీ తరువాయి

రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉ ంటున్నారు.

## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

మొదటిపేజీ తరువాయి

తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు. 11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. పక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

## ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

మొదటిపేజీ తరువాయి

వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని తమదిగా చూపిస్తూ ఫేక్ జీఓలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఈ నకిలీ జీఓలను వైరల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం భూమిని క్రమబద్ధీకరించినట్లు చెబుతూ ఐదు ఫేక్ జీఓలను సృష్టించిన నిందితులు, ఆ భూమిని ఎకరాకు రూ.3.5 కోట్లకు అమ్మేందుకు కుట్ర చేసినట్లు సమాచారం.

